

# విశ్వసూక్తము

## విశ్వశాంతి సమైక్యతా శంఖారావం

**సంపుటి : 10** **ఏప్రిల్ - 2019** **సంచిక : 2**

వ్యవస్థాపక సంపాదకులు : **శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్**

ప్రధాన సంపాదకులు : **శ్రీ కె.వి.ఆర్. సూర్యారావు**

గౌరవ సంపాదకులు : **శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు, శ్రీ యమ్.వి. ఆర్. శాస్త్రి**

సంపాదక వర్గము : **శ్రీ కె. వెంకట శివయ్య, శ్రీ పి.ఆర్. రావు, శ్రీ కె.కె. గుప్త,**

**శ్రీ పి.వి. రమణరావు,** ఆంధ్రభూమి ప్రతినిధి

**ఈ సంచికలో ...**

| | |
|---|---|
| సంపాదకీయం | 6 |
| 23-3-2019 నాడు హైదరాబాదులో కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంలో స్వామి దివ్యసందేశం | 8 |
| వేదాంతకథాస్రవంతి | 12 |
| గురువంటే ఎవరు? | 13 |
| శ్రీ వాసుదేవానంద సరస్వతీ (టెంబే స్వామి) సద్గురు చరిత్ర | 15 |
| విశ్వహృదయార్చన | 30 |
| ఆత్మబంధువు | 37 |
| అనుభవలహరి | 45 |
| కథాసూక్తము | 47 |
| సత్యసాయి చరితామృతం | 48 |
| గీతమంజరి | 49 |

సంవత్సర చందా : రూ. 100/- మాసపత్రిక వెల : రూ. 10/-

Edited, Printed & Published by Sri K.V.R. Surya Rao on behalf
Viswamanava Samaikyata Samsat, Viswamandiram,
3rd Line, Krishnanagar, Guntur - 522 006. (A.P.) INDIA
from G - 2, Orchids, D.D.Colony, Hyderabad - 500 007
and Printed at Sri Lakshmi Graphics, 1-8-436, St No. 10, Chikkadpally,
Hyderabad-500 020. Ph : 040-6666 2976

**చి॥ మధుబాబు, చి॥ల॥సౌ॥ ఆకుల మాధురిల**

వివాహ వార్షికోత్సవం (మార్చి 6, 2019)

**చి॥ ఆకుల సురేష్, చి॥ల॥సౌ॥ ఆకుల అర్చనల**

వివాహ వార్షికోత్సవం (మార్చి 9, 2019)

**చి॥ కె. మధుబాబు**

జన్మదినం (మార్చి 23, 2019)న

జరుపుకొన్న సందర్భంగా

**భగవాన్ శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్** వారి

దివ్యాశీస్సులను అర్థిస్తూ వారి పాద పద్మాలకు

వినమ్ర భక్తి పూర్ణ హృదయాలతో

నమస్సుమాంజలులు సమర్పిస్తున్నాము.

| | | |
|---|---|---|
| **శ్రీ ఆకుల కోటేశ్వరరావు** | **శ్రీమతి కె. వసంతకుమారి** | **చి॥ ఆకుల వెంకట సురేశ్** |
| **శ్రీమతి ఆకుల కామేశ్వరి** | **చి॥కె. మధుబాబు** | **చి॥ల॥సౌ॥ అర్చన** |
| **(అమ్మ)** | **చి॥ల॥సౌ॥ మాధురి** | **చి॥ ధనుష్** |
| | **చి॥విశ్వరిషి** | |
| | **చి॥ విశ్వశ్రీ అపురూప** | |

# జ్ఞానసూక్తమ్



**సన్న్యాసః కర్మయోగశ్చ నిఃశ్రేయసకరావుభౌ ।**
**తయోస్తు కర్మసన్న్యాసాత్ కర్మయోగో విశిష్యతే ॥**

**- భగవద్గీత అధ్యాయం 5, శ్లోకం 2**

ప్రతి జీవి ముక్తిని - అనగా - జీవరాహిత్యాన్ని కోరుకుంటాడు. ఎందుకనగా జీవించియుండే ప్రతి వ్యక్తి ఏదో ఒక కర్మను నిర్వహిస్తూనే ఉంటాడు, దాని వలన కలిగే ఫలితాలను అనుభవిస్తుంటాడు. అందువలన కర్మ చేయకుండా ఉండడం ద్వారా అనగా కర్మపరిత్యాగం ద్వారా కర్మఫలాన్ని అనుభవించకుండా ఉండడానికి వీలవుతుంది కదా అని ఆలోచన కలగవచ్చు. కర్మ మార్గమే కాక ముక్తిని చేర్చే వేరొక మార్గం భక్తి మార్గమని తెలుపుతూ శ్రీ కృష్ణ భగవానుడు భక్తితో కూడిన కర్మ మార్గం విశిష్టమైనదని అర్జునినికి పై శ్లోకంలో వివరిస్తారు. తద్వారా అర్జునిని సంశయంవదలి కర్తవ్యోన్ముఖుణ్ణి కావిస్తాడు.

## సంపాదకీయం

# ఆదర్శం

**- పి.వి. రమణరావు**

ఏప్రిల్‌లో 'శ్రీరామనవమి' పండుగ చేసుకున్నాం. శ్రీరామనవమి అంటే సాధారణంగా ఏం చేస్తాం. ఆలయాల్లోనో, గ్రామాలు, పట్టణాల్లోని ముఖ్యమైన ప్రదేశాల్లో సీతారాముల కళ్యాణం నిర్వహిస్తాం. పందిళ్లు, షామియానాలు వేసి రెండు మూడు గంటల పాటు కళ్యాణ కార్యక్రమంలో పాల్గొంటాం. కొన్నిచోట్ల సీతారామ కళ్యాణం సందర్భంగా వంటలు చేసి అన్నదానం చేస్తారు. భోజనాలు వగైరాలు పూర్తయ్యాక ఎవరి దారిలో వారు వెళ్లిపోతాం. మళ్లీ ఏడాది వరకు రాముడు గుర్తుకురాడు. శ్రీరామాలయాలు ఉన్నచోట గుడికి వెళ్లి సీతారాముల పూజల్లో పాల్గొంటారు.

రాముడు ఎవరు? ఆయన గుణగణాలు ఏమిటి? త్రేతాయుగానికి సంబంధించిన రాముడిని నేటికీ ఎందుకు స్మరించుకుంటున్నాం? అని ప్రశ్నించుకుంటే ... రాముడి అవతారం ఈ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది కాబట్టే. స్వయంగా భగవంతుడే అయిన రాముడు అహంకారంతో జీవించలేదు. మానవ రూపంలో జన్మించిన భగవంతుడు ఈ మానవాళి ఏ విధంగా జీవించాలో ఆచరణలో చూపాడు. అయోధ్యా రాజ్యానికి రారాజుగా పట్టాభిషేకం జరగాల్సిన సమయంలో, 14 సంవత్సరాలు అడవులకు వెళ్ళాలని ఆదేశాలు వస్తే ఆచరించాడు. రాజ్యాన్ని, భోగభాగ్యాలను వదిలి కేవలం 'మాట' నిలుపుకునేందుకు అడవులకు వెళ్లాడు. ఒక్కక్షణం కూడా కృంగిపోలేదు. కష్టాలు, నష్టాలు, ఇబ్బందులు వచ్చినా కృంగిపోలేదు. అడవిలో నివసిస్తుండగా భార్య సీతమ్మను రావణాసురుడు ఎత్తుకుపోతే, ఆమెజాడ తెలుసుకునేందుకు అనేక మార్గాల్లో ముందుకు సాగాడు. సీతమ్మ లంకలో ఉందని తెలిసిన తర్వాత అక్కడకు వెళ్లేందుకు వానరులు, అడవుల్లో నివసిస్తున్న వారి సహకారం తీసుకున్నాడు. ఒక పనిచేయాలని చేసేందుకు ఐకమత్యం అవసరమని నిరూపించాడు. రావణాసురుడు అనేక శక్తులు ఉన్న మహానుభావుడని గుర్తించిన రాముడు రావణాసురుడిని వధించేందుకు ఆలోచించాడు. మహాశక్తివంతుడైన రావణాసురుడిని ఓడించేందుకు అత్యంత

శక్తి కావాలని గుర్తించాడు శ్రీరాముడు. శక్తి సంపాదించేందుకు దేవతల నుండి ఆశీస్సులు పొందేందుకు పూజలు చేశాడు. ఆదిత్యహృదయం ద్వారా సూర్యుడిని ప్రసన్నం చేసుకున్నాడు. రావణాసురుడు ఏ దేవుడి ద్వారా (శివుడు) శక్తి పొందాడో, ఆ దేవుడిని (శివుడిని) ప్రసన్నం చేసుకునేందుకు పూజలు నిర్వర్తించాడు. రావణాసురుడిని సంహరించేందుకు విభీషణుడి ద్వారా కీలకమైన సమాచారాన్ని సేకరించాడు. ఆ తర్వాత రావణాసురుడి వధ, సీతమ్మను విడిపించుకుని వెళ్లడం తదితరాలన్నీ మనకు తెలుసు.

'నా జీవితమే నా సందేశం' అని మొట్టమొదట ఆచరణలో చెప్పింది శ్రీరామచంద్రుడే. ఏ కోణంలో చూసినా, అడుగడుగునా ఆదర్శంగా ఉండేలా జీవించాడు. సమస్య ఏది వచ్చినా, ఆలోచనతో, వివేకంతో ముందుకు సాగాడు. నేనొక్కడినే ఏదైనా చేస్తాను ... అన్న అహంకారం ఏ కాశానా ఆయనలో కనిపించలేదు. ఒక కుమారుడిగా, ఒక భర్తగా, ఒక సోదరుడిగా, ఒక తండ్రిగా, ఒక రాజుగా, ఒక మిత్రుడిగా ఎలా జీవించాలో ఆచరణలో చూపాడు. రాముడిలా జీవించాలని నేటికీ అంటుంటాం. ఎందుకు? రాముడి వ్యక్తిత్వం అలాంటిది!

సీతారాముల కళ్యాణం అంటే ప్రకృతి–పురుషుల కలయిక. ప్రకృతి ప్రశాంతంగా ఉండాలి. ప్రశాంతంగా ప్రకృతి ఉండేలా మనుషులమైన మనం జీవించాలి. ఈ భువిపై 84 లక్షల జీవరాసులు ఉన్నాయని అంటుంటారు. ఒక్క మనిషి తప్ప ఏ జీవి వల్ల ప్రకృతి కలుషితం కావడం లేదు. మనిషి ఒక్కడే ప్రకృతిని కలుషితం చేస్తున్నాడు. సమస్త జీవులకు హాని కలిగిస్తున్నారు. మనిషి తెలివి, ఆలోచన, మేధస్సు ప్రకృతిని రక్షించేందుకు ఉపయోగపడాలి తప్ప, ప్రకృతిని నాశనం చేసేందుకు ఉపయోగపడకూడదు. సీతారాముల కళ్యాణం చేసే మనం సీతారాముల్లాగా జీవించాలి. ఎన్ని కష్టాలు ఎదురైనా, ఎన్ని నష్టాలు ఎదురైనా భార్యాభర్తలు కలిసి ఉండాలి. సీతారాములు ప్రేమను ఇచ్చి పుచ్చుకున్నారు. నేడు కూడా దంపతులు పరస్పరం ప్రేమతో జీవించాలి. ఒక ఇంటిలో దంపతులు ప్రేమగా ఉంటే ఆ ఇల్లు ప్రశాంతంగా ఉంటుంది. తద్వారా ప్రపంచమంతా ప్రశాంతంగా ఉంటుంది.

# 23-3-2019 నాడు హైదరాబాదులో కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంలో స్వామి దివ్యసందేశం

ప్రేమ మూర్తులారా,

పరమ పవిత్రమైన దివ్యక్షేత్రం. ఈనాడు ప్రాణప్రతిష్ట చేసుకున్నటువంటి సుక్షేత్రం. కళ్యాణ శ్రీనివాసం అని పేరు పెట్టుకున్నాము. నిత్య కళ్యాణ శ్రీనివాసుడు. శ్రీనివాస్ అన్న పేరు చాలా ఇష్టమైనది. స్వామీజీ చెప్పారు ఒకప్పుడు తిరుమల ఎలా ఉండేది, ఇప్పుడు ఎలా ఉంది అని. దైవిక శక్తి యొక్క గొప్ప గుణం తనదగ్గరకు అందరిని లాక్కుంటుంది. ఒకానొక విధమైన ఆకర్షణ ఉంటుంది. ఆ దైవికశక్తిని మనం గ్రహించి మనలో నిక్షిప్తం చేసుకుంటే మీరు ఎక్కడకు పోనక్కరలేదు, మీ దగ్గరకే పరుగెత్తుకుని వస్తారు.. మీరు ఎమ్మెల్యే కాదు, ఎంపి కాదు, సిఎమ్ కాదు, పిఎమ్ కాదు ఎవరైనా కాగలుగతారు, ఏదైనా చేయగలుగుతారు.

శ్రీనివాసుడు అంటే శ్రీ నివాసముగా కలవాడు. శ్రీని తన హృదయంలో పెట్టుకున్నాడు కాబట్టి, శ్రీమాతను తనహృదయంలో పెట్టుకున్నాడు కాబట్టి వేంకటేశ్వరస్వామికి ఇంతటి మహత్యము, గొప్పతనము, ఆకర్షణ వచ్చాయి. కాని, ఆ అమ్మ గనక పక్కకు తప్పుకుంటే వేంకటేశ్వరస్వామిని ఎవరు చూడరు. ఏ వ్యక్తి తన భార్యను హృదయంలో పెట్టుకుని ఆరాధిస్తూ గౌరవిస్తుంటాడో అతనికి సమాజంలో విలువ వస్తుంది, శక్తి వస్తుంది. అతని భార్య కూడా అతనికి సేవ చేస్తుంది. విష్ణుమూర్తి పాదాలను నొక్కుతూ వుంటుంది లక్ష్మీదేవి. ఎందుకంటే తనని హృదయంలో పెట్టుకుని ఆరాధిస్తున్నాడు, ప్రేమిస్తునాడు కాబట్టి ఆయనకు సేవ చేస్తుంది.

విష్ణుసహస్రనామాలలో మొట్టమొదటి నామం విశ్వం. విశ్వం విష్ణు వషట్కారో. అనంతమైన విశ్వస్వరూపమే విష్ణువు. ఆయనకు ఇద్దరు భార్యలు, శక్తి రూపంలో శ్రీదేవి, ఆకారం దాల్చిన ప్రకృతి మాత భూదేవి. ఈ ఇద్దరితో కళ్యాణం చేయాలి. నిత్యకళ్యాణం చేయాలి. ఇలా కళ్యాణం చేయడం అంటే

అర్థం నీలోని శక్తి ఆకారం దాల్చి దేహంగా వచ్చింది, దేహమే దేవాలయం. దేహో దేవాలయ ప్రోక్త. ఈ దేహాన్ని దేవాలయంగా భావించు. శరీరం శక్తివంతం చేసుకో. సప్తధాతువులతో కూడినది ఈ శరీరం. చక్కగా శక్తివంతంగా ఉండాలంటే ధాతుపుష్టి ఉండాలి. అది ఉంటే ఏ డాక్టరు దగ్గరకు వెళ్ళవలసిన పని లేదు. యోగము వలన భోగము కలుగుతుంది, శక్తి వస్తుంది. యోగాన్ని అభ్యాసం చేయండి. ప్రపంచం యోగమును గుర్తిస్తుందని ఎప్పుడో చెప్పాను ఎవరు నమ్మలేదు. ఇది ఐక్యరాజ్య సమితిలో కూడా చెప్పాను. అది నిజమయింది. రేపు కాదు ఇప్పుడే భారతదేశం యొక్క గొప్పతనాన్ని ప్రపంచ మేథావులు గుర్తించి, ప్రపంచంలోని అగ్రదేశాల నాయకులు కూడా గుర్తించి సెల్యూటు చేస్తున్నారు, అనుసరించడానికి క్యూలో వచ్చి నిల్చుంటున్నారు. భారతదేశం ప్రపంచం మొత్తానికి గురుస్థానంలోకి వెళ్ళి ఇంజనులాగ యావత్తు సమాజాన్ని నడిపి ప్రశాంతిని కలిగించే స్థాయికి వస్తుంది, అందుకు మనం శక్తివంతం కావాలంటే నిత్య కళ్యాణం చేయాలి. ఏమిటి నిత్య కళ్యాణం అంటే విష్ణుమూర్తికి ఇద్దరు భార్యలతోటి ఆ సంబంధాన్ని పటిష్టంగా ఉంచడానికి ప్రతి రోజు, ప్రతి క్షణం కలుపుతూ ఉండాలి. మీరు మీలోని శక్తికి, శరీరానికి, సమాజానికి ముడివేసి సమాజాన్ని బాగుచేయడమే మనకు కావలసింది కాని వేరు కాదు. సమాజాన్ని బాగుచేసేవి దేవాలయాలు.

గుంటూరు జిల్లాలో చందోలు అనే ఊరులో చందోలు శాస్త్రిగారు అని ప్రసిద్ధమైన వ్యక్తి ఉండేవారు. ఇప్పుడు లేరు. ఆయన చనిపోవడానికి సిద్ధంగా వున్న సమయంలో చూడడానికి వెళ్ళినప్పుడు ఆయన ఇలా చెప్పారు. బ్రహ్మ గారు బ్రహ్మలోకంలో ఉండి కళ్ళు తెరిచారు. ఎదురుగుండా ఒక వ్యక్తి నిల్చుని వున్నాడు. ఏమయ్యా మానవాకారంలో ఇక్కడకు వచ్చావు ఎవరు నువ్వు అని బ్రహ్మగారు అడిగారు. నన్ను అంబరీషుడు అంటారు, భూలోకంలో చక్రవర్తిని, నేను అనేక పనులు ప్రజలకు ఉపయోగమైనవి చేసాను అన్నాడు ఆ వ్యక్తి. ఇతనికి అహంకారం చాలా ఉంది అని అనుకున్నారు బ్రహ్మగారు. నేను చేసిన పనుల వలన బ్రహ్మలోకానికి రాలేదు, భూలోకంలో ఋషులైనటు వంటి వారు, చక్కని పాండిత్యం కలిగినవారు, యోగశాస్త్రం, మంత్రశాస్త్రం తెలిసినటువంటి వారు విశ్వశాంతి కొరకు చక్కటి యజ్ఞం చేయాలని తలపెట్టాం,

మీరు వచ్చి ఆ యాగం నిర్విఘ్నంగా జరిగేలా చూడాలి అని కోరగా నేను వెళ్ళాను. నాకు మంత్రం తెలియదు, శాస్త్రం తెలియదు, ఆ యజ్ఞం నిర్విఘ్నంగా జరగడానికి దోహదం చేసి, కావలసినవాటిని సమకూర్చాను. యజ్ఞం విజయవంతంగా పూర్తి అయింది. తర్వాత ఆ ఋషులు అక్షింతలు నీళ్ళు తీసుకుని నా నెత్తిమీద జల్లి బ్రహ్మలోక ప్రాప్తిరస్తు అని ఆశీర్వదించారు, దానివలన నేను బ్రహ్మలోకానికి వచ్చాను అని అంబరీషుడు చెప్పాడు. ఇది ఎందుకు చెప్పానంటే చేసినవాళ్ళు పోలేదు కాని ఏమి తెలియకపోయినా సహకారం అందించినవాడు ఫలితం పొందాడు. అలాగ ఎవరైనా తెలియకపోయినా కూడా తెలుసుకుని సహాయం చేసినట్లయితే భగవంతుడు అనేవాడు ఉంటే, ఉన్నాడు మనకు ఆశీస్సులు ఇచ్చి ముందుకు తీసుకుని వెళ్తాడు. ఆబు బెన్ ఆడమ్ అనే వ్యక్తి దీనికి ఉదాహరణ.

సమాజాన్ని సంస్కరించుకుందాం, మనం ముందు శక్తివంత మవుదాము. డాక్టరు గనక పేషంటు అయితే ఇక పేషంట్లను ఏమి చూస్తాడు. భగవంతుడు ఇచ్చిన శరీరాన్ని దృఢంగా ఉంచుకోవాలి, శక్తివంతంగా ఉంచుకోవాలి. శరీరానికి వయసు వస్తుంది కాని ఎప్పుడూ 16 సంవత్సరాల వయసుగా ఉండాలి కాని వేరేగా ఉండకూడదు. మనసు ముఖ్యమైనది. మనయేవ మనుష్యానాం కారణం బంధమోక్షయో. బంధించబడడానికి గాని వేరే దానికి గాని మనసే కారణం. మనసును శక్తివంతం చేసుకోవాలి. మనసును శక్తివంతం చేసుకున్నాడు కాబట్టి డాక్టరు, లేక ఇంజనీరు అయినాడు. మనసును శక్తివంతం చేసుకుంటే కర్షకుడు అయినాడు. ఆ రంగంలో జ్ఞానాన్ని సంపాదించుకుని ఆ వ్యక్తి అవుతున్నాడు. డాక్టరు జ్ఞానాన్ని పొందితే డాక్టరు అంటున్నాము. ఇంజనీరు జ్ఞానాన్ని పొందితే ఇంజనీరు అంటున్నాము.

ఈ రోజు కోసమే, దీనికోసమే తీవ్రమైన దీక్షలో ఉండి కూడా గుంటూరు నుంచి ఇక్కడకు వచ్చాను, మళ్ళీ ఇప్పుడు గుంటూరు వెళ్ళి నా కార్యక్రమం చూసుకోవాలి. ఇలా వచ్చానంటే దీనిమీద, హనుమాన్ స్వామి యందు, నల్గొండ నుంచి వచ్చిన జియరు స్వామి యందు ఎంతటి ఆప్యాయత వుందో, గౌరవం వుందో తెలియజేస్తూ మనమంతా కలిసి ఈ క్షేత్రాన్ని శక్తివంతమైన క్షేత్రంగా

చేసుకుందాము. మనం ఎంతో ఖర్చు పెట్టున్నాం. డబ్బులు లేక కాదు బాధపడుతున్నది. అనవసరమైన వాటికి ఖర్చు పెట్టున్నాము. లగ్జరీలకు, సినిమాలకి ఖర్చుపెట్టున్నాం. తాగుడుకి ఖర్చుపెట్టున్నాం, ఇంకోదానికి ఖర్చు పెట్టున్నాము. ఇంత ఖర్చుపెట్టున్నామే , ఇంతటి ప్రకృతినిచ్చి, సూర్యుణ్ణి ఇచ్చి, వెలుగునిచ్చి, భూమిని, గాలిని అన్ని ఫ్రీగా ఇచ్చిన భగవంతునికి ఏమి ఇస్తున్నాము అని ఒకసారి ఆలోచించి , భగవంతుడు కూడా మన ఇంటిలో ఒక మనిషి, గురువు కూడా మన ఇంటిలో ఒక మనిషి అని, మన ఇంటిలో సంవత్సరానికి ఒక మనిషికి ఎంత ఖర్చు పెట్టున్నామో అంత ఖర్చు గనక ఆయనకు సంవత్సరానికి ఇచ్చినట్లయితే ఇలాంటి దేవాలయాలు నిత్యకళ్యాణం పచ్చతోరణంగా వుండి మనం శక్తివంతమయేటటువంటి పద్ధతిలో నిలుస్తాయి. దివ్యమైన నిత్యకళ్యాణ క్షేత్రంగా, నిత్యకళ్యాణ శ్రీనివాస మందిరంగా ఈ దేవాలయం అభివృద్ధి చెందాలని, చుట్టూ వున్నటువంటివారు గాని, ఎమ్మెల్యేలు గాని, ఎంపీలు గాని, సిఎమ్ గాని దీనిని ఆదరించాలని మనసారా కోరుకుంటూ అందరికి దివ్యమైన ఆశీస్సులు. విజయోస్తు, దిగ్విజయోస్తు.

**గురూపదేశములు**

మనుష్యులు రెండు విధములుగా ఉందురు. మొదటివారు చెరుగునట్టి చేటవంటివారు; రెండవ తరగతి వారు జల్లించు జల్లెడివంటివారు. చేట పనికి మాలిన పొల్లును విడిచి, ఉపయోగపడు బియ్యము పప్పును తనయందు నిలుపుకొనునట్లు మొదటి తరగతి వారు అయోగ్యములైన కామిని కాంచనముల వంటి వానిని విసర్జించి పరమ ప్రాప్యుడగు భగవంతుని మాత్రమే స్వీకరింతురు. జల్లెడ సన్నని పదార్థములను జాఱ విడిచి పొల్లును గ్రహించును. ఇట్లే రెండవ తరగతి జనులు పరమప్రాప్యమైన వస్తువును పరిత్యజించి కామిని కాంచనములవంటి వాటిని చేబట్టుదురు.

**- శ్రీ రామకృష్ణ పరమహంస**

## వేదాంతకథాస్రవంతి

# వేషము యొక్క విలువ

ఒక దొంగ రాత్రిపూట రాజుగారి అంతఃపురంలో ప్రవేశించినప్పుడు రాజు, రాణి వారి శయనమందిరంలో మాట్లాడుకుంటున్నారు. తమ కుమార్తెకు పెళ్ళి వయసు వచ్చింది, తగిన వరుణ్ణిచూసి వివాహం జరిపించాలి అని రాణి రాజుతో చెప్తున్నది. వారిద్దరు ఆ విషయం మీద కొంతసేపు మాట్లాడుకుని రాజకుమారి ఆధ్యాత్మిక చింతన కలిగి వున్నది కాబట్టి ఆమెకు ఒక సత్పురుషునితో వివాహం జరిపించాలని నిశ్చయించుకున్నారు. గంగానది తీరానికి సమీపంలో రాజమందిరం ఉంది. ఆ నదీతీరంలో అనేకమంది సత్పురుషులు తపస్సు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. రాజు మంత్రిని పిలిచి నదీతీరంలోని సత్పురుషులలో యోగ్యుడైనవాడు ఎవరైనా రాజకుమారిని వివాహం చేసుకునేవాడు కనిపిస్తాడేమో చూడండి అని చెప్పాడు.

క్రితం రాత్రి రాజు రాణీల సంభాషణ విన్న దొంగ సత్పురుషుడిలా వేషం ధరించి గంగానది తీరంలో కూర్చోవాలి అని నిశ్చయించుకుని అలాగే మర్నాడు కూర్చున్నాడు. మంత్రి అక్కడ ఉన్న సత్పురుషులు ఒక్కొక్కరిని రాజకుమారితో వివాహం గురించి అడుగుతూ వస్తున్నాడు కాని వివాహం చేసుకుని తిరిగి ప్రాపంచిక జీవితంలోకి రావడానికి ఎవరు ఒప్పుకోలేదు. సాధువేషం ధరించిన దొంగ వద్దకు మంత్రి వచ్చి రాజకుమారిని వివాహం చేసుకుంటే అర్ధరాజ్యం కట్నంగా ఇస్తారని, రాజు తదనంతరం మిగిలిన అర్ధరాజ్యం అతనికి లభిస్తుందని చెప్పాడు. ఆ మాటలు విన్న దొంగకు అకస్మాత్తుగా అతని మనసులో ఒక ఆలోచన వెలిగింది. సత్పురుషడులా వేషం ధరిస్తేనే రాజకుమారి, అర్ధరాజ్యం లభ్యమవుతున్నాయి, మరి నిజంగా సాధువునైతే ఇంతకు మించినటువంటి మంచివి, ఎక్కువ విలువైనవి లభ్యమవచ్చు కదా అని ఆలోచన వచ్చి అతడు పూర్తిగా మారిపోయాడు, వివాహం నిరాకరించాడు సాధువుగా జీవనం సాగించడానికి నిశ్చయించుకున్నాడు.

(స్వామి సంబుద్ధానంద యొక్క వేదాంత ట్రూ స్టోరీస్ నుండి సేకరణ)

# గురువంటే ఎవరు?

గడిచిన మార్చి మాసము అతి పవిత్రమైన మాసము ఎందుకనగా 1944 వ సంవత్సరంలో మార్చి 5 గురు దేవులు, భగవాన్ శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ మానవ రూపంతో భువి మీద అవతరించిన రోజు. గురువులు ఎందుకు అవతరిస్తారన్న ప్రశ్నకు స్వామిని దర్శించుకుందుకు వచ్చి స్వామి ఆదేశానుసారం ఉపన్యసించిన కవి, పండితులు ఆచార్య ముదిగొండ శివప్రసాద్ గారి జవాబులో కొంత విశదీకరించబడింది. మానవులు ఒక ధ్యేయంతో జన్మిస్తారు. మానవ జన్మ కర్తవ్యం ఏమిటి అని తెలుసుకొని దాని సార్ధకత కొరకు కృషిచేయడం ప్రధానమైనది. ఈ కృషిలో గురువుల చేయూత చాలా అవసరం. మనిషి తనంతట తానుగా తెలుసుకోలేని విషయం 'తాను ఎవరు, ఎందుకు జన్మించాను?' అన్నది. ఈ విషయం భగవత్స్వరూపులైన గురువులు ద్వారా తెలుసుకొనవచ్చు. ఈ గమ్యసాధనకు గురువుల అనుగ్రహం ఎంతో అవసరం, అటువంటి సద్గురువులను సందర్శించుకోవాలన్న తపనతో ఉన్న తమకు స్వామీజీ భక్తురాలైన శ్రీమతి లక్ష్మీకృష్ణగారి ద్వారా స్వామీజీ దర్శన భాగ్యం లభించిందని వారు తెలియజేశారు.

ఎవరైతే వ్యక్తుల మానసిక, ఆధ్యాత్మిక అంధకారాన్ని తమ బోధల ద్వారా, ప్రవర్తన ద్వారా పోగొట్టుదురో వారే గురువు. సాధారణ పరిభాషలో గురువనగా – ఏదో ఒక జ్ఞాన శాఖలో పరిపక్వత కలిగియుండి, దానిని ఇతరులకు బోధించగలిగే వ్యక్తి. కాని హిందూమతానుసారం ఇతరులకు ముక్తి మార్గాన్ని చూపించే ఆధ్యాత్మిక తత్త్వగురువే గురువు. సమాజ సంప్రదాయానికి వారు మూలస్తంభాలు. ధర్మ సంరక్షణ కొరకు జన్మనెత్తినటు వంటి వారు. గురువు మన మధ్య నడయాడే భగవత్స్వరూపుడు, లేక భగవంతుని గురించిన జ్ఞానాన్ని కలిగియుండి భగవంతుని ప్రతినిధిగా ముక్తికి దారి చూప గలిగే మహా జ్ఞాని. మానవ ప్రవర్తనలోని ఉన్నత లక్షణాల వ్యక్త రూపమే కాక ఇతరులకు జ్ఞానాన్ని పంచి వారిని జ్ఞానవంతులుగా తీర్చి దిద్దే మహోన్నత భగవద్భక్తుడు గురువు. వేలాది సంవత్సరాలుగా భారదేశంలో హిందూమతం ఎన్నో అడ్డంకులు,

పరీక్షలు ఎదురైనా వాటినన్నింటిని అధిగమించి ఈ నాటికి సుస్థిరంగా ఉన్నదంటే దానికి ముఖ్యంగా బాధ్యులు గురువులే. అందుకనే భారత దేశంలో గురువును, జన్మనిచ్చిన తల్లిదండ్రుల కంటె మిన్నగా, భగవంతునితో సమానంగా అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తుంటారు.

హిందూమతంలో సాంఘికపరంగా ఆధ్యాత్మిక గురువులు – సలహాదారులు, అధ్యాపకులు, జ్యోతిష్కులు, వైద్యులు, నాయకులు, జీవితరక్షకులు, ధర్మపరిరక్షకులు, భూతవైద్యులు, సందేశవాహకులు వంటి విభిన్న పాత్రలను పోషిస్తుంటారు. గురుత్వ నిర్వహణలో స్త్రీ పురుష విభేదం కనిపించదు. సమాజంలోని అన్ని తరగతులకు చెందిన వారు కావచ్చు. విద్యావిహీనులైనప్పటికి ఆత్మ జ్ఞాన సంపన్నులై ఉంటారు.

తమ బోధల ద్వారా, ప్రశిక్షణ ద్వారా గురువులు ఆదర్శవంతులుగా సమాజంపై బలీయమైన ప్రభావాన్ని కలిగి ఉంటారు. వారిపట్ల సమాజంలో విశ్వాసం ప్రదర్శితమవుతుంటుంది. అటువంటి మహా గురువు భగవాన్ శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ మనకు గురువుగా లభించడం మన పూర్వ జన్మ సుకృతం. వారి జన్మదినం (మార్చి5) గుంటూరులో అంగరంగ వైభవంగా భక్తులు నిర్వహించి స్వామి దివ్యాశీస్సులను పొందారు. వారికి శతసహస్ర అభివందనములు సమర్పించుకుందాము.

**గమనిక**

చందాదారులు తమ సభ్యత్వాన్ని సకాలంలో పునరుద్ధరించుకోవాలి. తమ రచనలను, చందాను (మనీ ఆర్డరు ద్వారా కాని, బేంకు చెక్కు ద్వారా కాని) ఈ దిగువ అడ్రసులకు **విశ్వమానవ సమైక్యతా సంసత్** (Viswamanava Samaikyata Samsat) 'విశ్వమందిరం', 3వ లైను, కృష్ణనగర్, గుంటూరు – 522 006. వెబ్‌సైట్ : www.viswaguru.com లేక పి. రామగోపాలరావు (P. Ramagopala Rao), 3-5-1092/2, వెంకటేశ్వర కాలనీ, నారాయణగుడ, హైదరాబాదు – 500 029, Phone : 040-24755674. పంపవలెను. K.K. Gupta, Cell : 9848414585, kkguptaca@gmail.com ఇదే అడ్రసుకు 'విశ్వసూక్తము' అందని చందా దారులు తెలుపవలెను.

# శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి

## (టెంబే స్వామి)

## సద్గురు చరిత్ర

## పదునారవ అధ్యాయము

**- శ్రీ జి.వి.ఎల్.ఎన్. విద్యాసాగర శర్మ**

(గత సంచిక తరువాయి)

### నాలుగు, ఐదు చాతుర్మాస దీక్షలు - హిమాలయము (శక సం॥ 1816, 1817)

### నరనారాయణ సాక్షాత్కారము

లోగడ అధ్యాయములో మహారాజ్ బదరీయాత్రకు ప్రయాణమైన విషయము ప్రస్తావించబడినది. వారట్లు ప్రయాణమై దారిలో హృషికేశము, దేవప్రయాగ, రుద్రప్రయాగ, గుప్తకాశి, కేదారము మొదలైన ప్రదేశములు చూచుకొనుచు బదరీచేరి, బదరీనారాయణ దర్శనము చేసికొనిరి. ప్రతి ప్రదేశమున ఒకటి రెండు రోజులు, కొన్నిచోట్ల మరికొన్ని దినములు వారు నివసించుట జరిగెను. ఆయన వెంబడి దక్షిణాది బ్రాహ్మణ యాత్రికులుండుటచే భిక్షకు ఆటంకమేమియును కలుగలేదు. హిమాలయమునందు బదరీనారాయణ దర్శనమునకు ఆయన పోవుచుండగా, ఒకచోట దారికడ్డముగా ఒక పెద్ద మంచుగడ్డ పడియుండెను. ముందుకు పోవుటకు దారి లేకుండుటచే మహారాజ్ అచ్చటనే ఆగిపోయిరి. ఇంతలో ఆ మంచు గడ్డపైనుండి ఇరువురు వ్యక్తులు వచ్చి "ముందుకు దారిలేదు. వెనుకకు మరలండి! లేనిచో ప్రమాద"మని హెచ్చరించిరి. ఆ మాటవిని మహారాజ్ "నా దేహము పడిపోయినను సరే! నేను ముందుకు పోవలసినదే. నేను నారాయణ దర్శనమునకై వచ్చితిని, ఆ దర్శనము కానిదే వెనుకకు మరలునది లేదు. ముందుకు దారిలేదనుచున్నారు. మరి మీరెట్లు వచ్చితిరి?" అని నిశ్చయముగా మహారాజు పలుకగా విని, ఆ ఇరువురు అదృశ్యమైరి. "వారెవరై యుందు"రని మహారాజ్ భావించుచుండగా

సాక్షాత్తు నరనారాయణ మహర్షులుగా అల్లంత దూరములో ఆ ఇరువురు మహారాజ్‌కు దర్శనమిచ్చి అంతర్ధానమైరి.

ఒకసారి ఆయన హిమాలయములలో సంచరించుచుండగా, హిమాలయములలో తపస్సు చేసుకొనుచున్న ఒక యోగి, మహారాజ్ రాకను చూచి, పర్వతము పైనుండి క్రిందికి దిగివచ్చి, వారి దర్శనము చేసుకొని నమస్కరించెను. మహారాజ్ తమ చేతులు పైకెత్తి "నారాయణ" యని ఆశీర్వదించగనే ఆ యోగి అదృశ్యమయ్యెను.

## హిమాలయములలో మహారాజున్న తీరు

బదరీనారాయణ యాత్రలో ప్రయాణమధ్యమున బాటసారులు మకాము చేయుటకై అచ్చటచ్చట సత్రములు కట్టబడి యుండెను. బీద యాత్రీకులకు అన్నము, బట్టలు, గొంగళి, ధావళి మొదలైన వస్తువులను శ్రీమంతులు దానమిచ్చెడివారు. కాళి కంబళివాలాగా ప్రసిద్ధికెక్కిన సాధుపుంగవుడు శ్రీమంతులనేకుల తోడ్పాటుతో ఒక వ్యవస్థ ఏర్పాటు చేసెను. ఆ వ్యవస్థ ద్వారా పైన పేర్కొనబడిన వస్తువులు బాటసారులకు దానమిచ్చునట్లు చేసెను. కొండల మధ్య మంచు చలి ఎక్కువగటుచే ఎందరో ఆ దానము పరిగ్రహించు చుండిరి. ఇంత చలి ప్రదేశములో గూడ మహారాజ్ వద్ద రెండు శాటీలు, ఒక ధావళి తప్ప మరేవియు దగ్గర యుండెడివికావు. ఆయన చలిమంటలు కూడ కాగేవారు కాదు. ఆ ప్రకారముగా హిమాలయములలో ఆయన ప్రయాణము చేసిరి. ఇట్టి శక్తి కేవలము సదాచరణము చేతనే లభించగలదని మహారాజ్ తన జీవితము ద్వారా లోకమునకు వెల్లడించిరి.

## బదరీనారాయణ పూజ

దేవాలయములో బదరీనారాయణ దర్శనము దూరమునుండియే చేసుకొను మర్యాద అచ్చట గలదు. కారణమేమనగా అచ్చట వెలసియున్న మూర్తి స్పర్శవేదిమూర్తి యగుటయే! లోకులు ఇనుము మున్నగు లోహములు తెచ్చి, మూర్తికి తాకించి బంగారముగా మార్చుదురేమోనన్న అనుమానముతో యాత్రికులను మూర్తి దగ్గరకు రానీయక దూరముననే నిలిపెడివారు. కాని

మహారాజ్ మాత్రము ఎట్టి ప్రతిబంధకము లేకయే, నేరుగా దేవుని దగ్గరకు పోయి, దర్శనము చేసుకొని తృప్తిగా పూజించిరి.

## నియమోల్లంఘన

గంగోత్రి పోవు సమయమున ఒకచోట మహారాజ్ స్నానము చేసిరి. స్నానము చేయగనే విపరీతముగా చలివేసి, శరీరమంతయు గడ్డకట్టి కదల లేకపోయిరి. అంతలో ఎవరో నిప్పుల కుంపటి తెచ్చి వారి దగ్గర పెట్టిరి. కొంతసేపటికి రక్తప్రసరణ మామూలుగా జరిగెను. మహారాజ్‌ను దత్తప్రభువు "అగ్నిస్పర్శ చేయరా"దని పూర్వము ఆజ్ఞాపించియుండెను. కాని ఆచోట మాత్రము వారా నియమము పాటించలేకపోయిరి. తమ సంపూర్ణ ఆయుష్య ములో నియమోల్లంఘన అనెడి ఘటన ఆ ఒక్కసారి మాత్రమే జరిగినదని మహారాజ్ అప్పుడప్పుడు మాటల సందర్భమున చెప్పుచుండెడివారు.

## సమాధిస్థితి

గంగోత్రికి ప్రయాణము చేయు దారిలో ఒక యూరు వచ్చెను. ఆ యూరిలో ముసల్మాను లెక్కువగా నివసించుచుండిరి. తమతో బాటు వచ్చుచున్న యువకునొకని ముందుకు సాగిపొమ్మని చెప్పి పంపి, అచ్చటవున్న ఒక బండపై మహారాజ్ కూర్చుండిరి. కొంచెము సేపు అట్లు కూర్చుండి, అలసటచే ఆయన ఆ బండపైననే శయనించిరి. వెంటనే నిద్రపట్టెను. కొంతసేపటికి పెద్దవర్షము కురిసెను. "ఇంత వర్షములో మహారాజ్ ఎట్లున్నారో?"నని ఆతురతతో ముందుకు సాగిన యువకుడు వెనుకకు మరలి వచ్చెను. బండపై సుఖముగా నిద్రపోవుచున్న మహారాజ్ అతనికి కనిపించిరి. కాని మహారాజ్‌కు మాత్రము మెలకువ రాలేదు. ఎంత చిత్రమో చూడుడు! అది నిద్ర యనవలెనో, సమాధిస్థితి యనవలెనో తెలియక ఆ యువకుడు వెరగందెను.

అవధూత చింతన శ్రీ గురుదేవదత్త

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

పదునారవ అధ్యాయము సంపూర్ణము.

# పదునేడవ అధ్యాయము

## ఆరవ చాతుర్మాస దీక్ష - హరిద్వార్ (శక సం॥ 1818)

## తొలిపలుకు

మహారాజ్ హిమాలయముల లోనికి పోయిన తరువాత జరిగిన నాలుగు, ఐదు చాతుర్మాసము లెచ్చట జరిగినవో ఎవరికిని తెలియదు. వానిని గూర్చి మహారాజ్‌ను ఎవరును ప్రశ్నించి యుండలేదు. ఆ రెండు సంవత్సరముల కాలము మహారాజ్ అజ్ఞాత వాసమొనరించిరని మనము భావించవలయును. ఆ అజ్ఞాతవాసములో హిమాలయముల వంటి దుర్గమ ప్రాంతములో వారెట్లు ఉండగలిగిరో - ఎంతటి కఠోర తపస్సు చేసిరో - ఎందరు మహాత్ములను దర్శించి, సంభాషించిరో - ఎంతటి మహాశక్తిని సముపార్జించిరో అది యంతయు మనము ఊహించుకొనవలసినదే. కొన్నికొన్ని విషయములు మన ఊహకు కూడా అందనివిగా నుండును. ఇది అట్టిదిగా భావించి వారిని సాక్షాత్తు దత్తావతారులుగా నెంచి ఊహాతీతమైన ఆ మహాశక్తికి మనము కైమోడ్పుటకన్న చేయగలిగిన దేమియును లేదు. హిమాలయముల నుండి తిరిగివచ్చిన తరువాత మహారాజ్ జరిపిన ఆరవ చాతుర్మాసము యొక్క విశేషములు ఈ అధ్యాయములో వివరించబడినవి.

## రామమందిర నివాసము

హిమాలయయాత్ర పూర్తిచేసుకొని మహారాజ్ 1818 వైశాఖ పూర్ణిమ నాటికి తిరిగి హరిద్వార్ చేరుకొనిరి. అచ్చటనే చాతుర్మాసదీక్ష చేసిరి. ఆ సమయములో ఆయన ఆరునెలలు అచ్చట ఉండవలసి వచ్చెను. అక్కడ నుండి బ్రహ్మావర్తము వెళ్ళుటకు బయలుదేరిరి. హరిద్వార్‌లో ఆయనతోనున్న దక్షిణాది బ్రాహ్మణులందరును అంతకుముందే బయలుదేరి వెళ్ళుటచేత, మహారాజ్‌కు భిక్ష దొరకక, పదునెనిమిది దినములు ఉపవాసములుండవలసివచ్చెను. కొన్ని ప్రదేశములలో గుజరాతి బ్రాహ్మణులు ఫలములొసగగా, వానిని తిని ఉండవలసి వచ్చెను. ఒక గుజరాతి బ్రాహ్మణుని భార్య వేరుశెనగపప్పు, సెనగలు, గోధుమలు కలిపి వేయించి, పిండిచేసి మహారాజ్ కిచ్చెను. ప్రతిదినము ఆ పిండిని నీటిలో కలుపుకొని త్రాగి, ఇరువది ఇరువదైదు క్రోశుల దూరము ఆయన ప్రయాణము

చేసెడివారు. ఆ ప్రకారము ప్రయాణము చేయుచు బ్రహ్మావర్తము చేరుకొని, అచ్చటగల రామమందిరములో వారు నివసించిరి.

## పిశాచము యొక్క ప్రతీకారము

గణపతి బువా యనెడి సాధువు క్రీ.శ. 1857 సంవత్సరమున సిపాయి కలహములో పాల్గొనెను. ఆయన కూడ ఆ రామమందిరములోనే నివసించు చుండెను. ఆయన సోదరుని కొడుకు ఒకడుండెను. అతడు మహమ్మదీయ మతమును స్వీకరించెను. అతడు తన భార్యను తీసుకొనిపోవుటకై బ్రహ్మావర్తము వచ్చెను. ఆయన భార్య మహారాజ్ దగ్గరకు వచ్చి "మతాంతరుడైన భర్తతో నేను కాపురము చేయవచ్చునా? లేదా? ఈ విషయములో శాస్త్ర మేమి చెప్పుచున్నదో సెలవీయవలసిన"దని అడిగెను. "నీ భర్త ప్రాయశ్చిత్త కర్మజేసుకొని పరిశుద్ధుడైన తరువాత నీవతనితో సంసారము చేయవచ్చునని శాస్త్రము చెప్పుచున్న"దని మహారాజ్ చెప్పిరి. ఆ మాట విని, ఆమె వెడలిపోయి "ప్రాయశ్చిత్తకర్మ చేసుకొను" మని భర్తతో చెప్పెను. అందులకతడు సమ్మతించక పోవుటచేత ఆమె భర్తతో కాపురము చేయనొల్లక బ్రహ్మావర్తములోనే నివసించుచు హరిభక్తురాలై కాలము గడుపుచుండెను.

ఆమెకు ఐదు సంవత్సరముల ఈడుగల కుమారుడొకడుండెను. వానిని పిశాచమొకటి పట్టి పీడించుచుండెను. అతడు మాటిమాటికి స్మృతిదప్పి పడిపోవు చుండెను. పిల్లవాని బాధ చూడలేక తల్లి మహారాజ్ దగ్గరకి వచ్చి "దయచేసి పిల్లవాని బాధ పోగొట్టు"దని ప్రార్థించెను. ఒక భూర్జపత్రముపై యంత్రము వేసి, దానిని పిల్లవాని దండకు కట్టుమని మహారాజ్ ఆమెకిచ్చిరి. ఆ యంత్రము కట్టుట వలన పిల్లవాని బాధ ఉపశమించెను. కొన్నాళ్ళు గడచెను. ఒకసారి ఆమె బహిష్టురాలై యుండగా, ఆ పిల్లవాడు తల్లి దగ్గరకు పోవలయునని మారాము చేయసాగెను. "నీ దగ్గర యంత్రమున్నది. నన్ను తాకకూడదు" అని తల్లి చెప్పెను. ఆ పిల్లవాడు యంత్రము విప్పి, ఒక ప్రక్కన పడవైచి తల్లి దగ్గరకు పోయెను. అంతలో ఆ పిల్లవాని మేనమామ అచ్చటకు వచ్చి, హోలీ వేడుకలు చూపించు నిమిత్తము ఆ పిల్లవాని నెత్తుకొని వీధిలోనికి వెళ్ళెను. వారు పోవుదారిలో మహమ్మదీయుల గోరీ యొకటి యుండెను. వారు గోరీ

దగ్గరకు రాగానే అచ్చట ఉన్న పిశాచ మాపిల్ల వానిని పట్టుకొని మెడ విరిచెను. వెంటనే వాడు మరణించెను. ఆ పిశాచము పిల్లవాని తల్లి దగ్గరకుపోయి, ఆమెను ఆవేశించి "నీవు నాకు లోగడ రూపాయిన్నర బాకీ పడితివి. ఆ బాకీ యింతవరకు తీర్చియుండలేదు. అందుకు ప్రతీకారముగా నీ పిల్లవానిని చంపితిని. నీ మగనిని భ్రష్టునిచేసి నీకు కాకుండా చేసితిని. నీకు గర్భపాతములు కలిగించితి" అని చెప్పెను. ఇదెంతటి భయంకరమైన బలవత్తరమైన కర్మవిపాకమో చూడుడు!

## శ్రీమంతుని పిల్లవాని దొంగతనము

బ్రహ్మావర్తములో ఒక బ్రాహ్మణుడు పుస్తకము కొనవలయునని కొంత ధనమును కూడ బెట్టెను. ఒకరోజు ఆ యింటికి తాళములేని విషయము కనిపెట్టి, ఒక శ్రీమంతుని కుమారుడు ఆ ధనము దొంగిలించెను. ఆ బ్రాహ్మణుడు ఇంటికి వచ్చి చూడగా తాను కష్టపడి దాచిపెట్టుకొనిన డబ్బు కనిపించలేదు. అతడు విచారముతో మహారాజ్ వద్దకు వచ్చి తన పైకము తనకు తిరిగివచ్చుటకు ఉపాయము చూపుడని ప్రార్థించెను. "దొంగనుపట్టి" తెమ్మని మహారాజ్ దత్తగణము నాదేశించిరి. వెంటనే ఆ గణములో నొకడుపోయి, ఆ శ్రీమంతుని పిల్లవానిని నావేశించి మహారాజ్ దగ్గరకు వచ్చెను. తన దగ్గరకు వచ్చిన ఆ పిల్లవానిని చూచి "నీవీ బ్రాహ్మణుని ధనము దొంగిలించితివా?"యని మహారాజ్ అడిగిరి. "దొంగిలించితి"నని అతడు ముమ్మారు ఒప్పుకొనెను. "సంపన్నుల యింటిలో జన్మించి, ఇట్లు దొంగతనము చేయుట మంచిదికా"దని ఆయన ఆ పిల్లవానికి బుద్ధిచెప్పిరి. ఆ పిల్లవాడు మహారాజ్‌ను క్షమించమని వేడుకొనెను. మహారాజ్ దివ్యాశీస్సుల వలన ఆనాటి నుండి ఆ పిల్లవాడు సత్ప్రవర్తకుడాయెను.

## బ్రాహ్మణపిల్ల యొక్క పెండ్లి

కాన్పూర్‌లోని ఒక గౌడ బ్రాహ్మణునకు పది సంవత్సరముల వయస్సు గల ఒక కుమార్తెయుండెను. ఆ పిల్లకు మంచి సంబంధము చూచి వివాహము చేయవలయునని తలచి, ఆయన ఎన్నో సంబంధములు విచారించెను. చివరికి ఒక సంబంధము వచ్చెను. ఆ విషయము ఇంటిలో చెప్పగా ఆ పిల్ల "పిల్లవాడేమి చేయుచున్నా?"డని అడిగెను. "ఆ పిల్లవాడు సర్కారు నౌకరి చేయుచున్నా"డని

తండ్రి చెప్పెను. ఆ మాట విని ఆ పిల్ల "ఉద్యోగము చేయుచున్నవానిని నేను పెండ్లిచేసుకొనను. వ్యాపారము చేయుచున్న వానిని చేసుకొనను. నిత్యము భిక్షాన్నము గ్రహించి, తపశ్చర్యలో ఎవరుందురో? అట్టి బ్రాహ్మణోత్తమునే నేను భర్తగా వరింతు"నని కంఠోక్తిగా చెప్పెను. తండ్రికి ఆశ్చర్యము వేసి, ఎటు చేయవలెనో తోచక ఆ విషయమును మహారాజ్‌తో విన్నవించెను. మహారాజ్ "మీ అమ్మాయి పూర్వజన్మలో యోగభ్రష్టురాలు, ఇప్పుడిట్లు జన్మించినది. నీవు దాని యిచ్ఛకు వ్యతిరేకముగా చేయవలదు. ఆ పిల్ల కోరినట్లే ఆమెకిష్టమైన వరుడు లభించగలడు. మీరెచ్చటను వెదుకవలసిన పనిలేదు" అని ఆయనను సమాధానపరచిరి.

కొన్నాళ్ళకు ఆ బ్రాహ్మణుని యింటి సమీపమునగల ధర్మశాలలో, ఒక బ్రహ్మచారి తీర్థయాత్రలు చేయుచు వచ్చి దిగెను. ఆ పిల్ల ఆ బ్రహ్మచారిని చూడగనే "ఆయననే పెండ్లి చేసుకొందు"నని తండ్రితో చెప్పెను. ఆ బ్రాహ్మణుడు బ్రహ్మచారిని తమ యింటికి భోజనమునకు పిలిచి, ఆర్షేయ పౌరుషేయములు విచారించి, సంతుష్టిపడి, తన కూతురునిత్తునని పలికెను. తనకసలు వివాహేచ్ఛయే లేదని ఆ బ్రహ్మచారి చెప్పెను. బ్రాహ్మణుడు మహారాజు నాశ్రయించెను. మహారాజ్ మధ్యవర్తిత్వము నెరపెను. ఆ బ్రహ్మచారిని పిలిపించి "ఆ అమ్మాయి నిన్ను వరించినది. నిన్ను తప్ప మరొకరిని ఆమె చేసుకొనదు. నీవా పిల్లను పెండ్లి చేసికొనకున్నచో నీకు స్త్రీ హత్యాపాతకము చుట్టుకొనును. మీ యిద్దరి గోత్రములు, ఘటికలు కుదిరినివి. ఆమె నీ కనుకూలవతి. ఆ పిల్లను వివాహము చేసుకొని గృహస్థాశ్రమము స్వీకరించు"మని నచ్చచెప్పెను. మహారాజంతటివారు అట్లు చెప్పుచున్న అతడెట్లు కాదనగలడు? "సరే! మీరింతగా చెప్పుచున్నప్పుడు చేయునదేమున్నది? ఇదంతయు నా ప్రారబ్ధము" అని అతడు అంగీకరించెను. ఒక శుభముహూర్తములో వారిరువురకు వివాహ మయ్యెను. వివాహమైన వెంటనే ఆ పిల్ల తన భర్తవెంట తీర్థయాత్రలకు వెడలెను.

## సఖారాంశాస్త్రి టిల్లు

ప్రయాగ క్షేత్రములో ఒక సుప్రసిద్ధ ధర్మశాస్త్ర పరిషత్తు ఉండెను. ఆ పరిషత్ సమావేశములో పాల్గొనుటకు దేశము నలుమూలల నుండి అనేక

పండితులు పోవుచుండిరి. ఇందూర్ మహారాజ్ తమ సంస్థానము తరపున ప్రతినిధిగా పండిట్ సఖారాంశాస్త్రి టిల్లును నియమించి పంపిరి. వారు ప్రయాగ పోవు దారిలో మహారాజ్ దర్శనార్థమై ఆగెను. మహారాజును సందర్శించి, నమస్కారముచేసి తాను పరిషత్తు సభలలో పాల్గొనుటకు పోవుచున్న విషయము తెలిపెను. అప్పుడు మహారాజ్ "శాస్త్రిబువా! భగవంతుని విశ్వాసములే వేదములు. అవి అపౌరుషేయములు. భగవంతుడు సర్వసృష్టి చేసెను. జగద్వ్యవహార మెట్లు నడచునో ఆ విధానమంతయు మంత్రద్రష్టలైన మహర్షులచేత శ్రుతి స్మృతి పురాణములుగా చెప్పబడినవి. తలచినప్పుడెల్లను వానిని మార్చుటకు మన కధికారము లేదు. మహానుభావులైన భగవత్ శంకరాచార్యులవంటి మహామనీషి సైతము మార్పులు చేర్పులు సూచించలేదు. ఇంతవరకు వానిని మహాత్ములు సంరక్షించుచునే వచ్చిరి. వేదధర్మమునకు గ్లాని సంభవించు పరిస్థితిలో భగవానుడవతరించి ధర్మ సంరక్షణ చేయుచునేయున్నాడు. నిర్దోషమైన వానిలో తప్పులెన్ని, సరిదిద్దెడి అధికారము ఎవ్వరికిని లేదు. తప్పులున్నచో వానిని సవరించు బాధ్యత వానిని సృష్టించిన దేవునకొక్కనికే యున్నది. మనకా బాధ్యత కలదని భావించుట మహాపరాధము. మీబోటివారు ఈ డాంబిక సభలలో పాల్గొనుట యోగ్యముగా కనిపించుటలేదు" అని ఆయన మనస్సుకు నచ్చునట్లు బోధించిరి. శాస్త్రి ఆ మాటలు వినెనేకాని ఏమియును మాట్లాడలేదు. ఆ తర్వాత బయలుదేరి ప్రయాగపోయి వేదపరిషత్తులో పాల్గొనెను. అచ్చట పండితులు నోరు నొచ్చునట్లు చేసిన డాంబిక చర్చలకు, వాగ్వివాదములకు, రాద్ధాంత సిద్ధాంతములకు అర్థము లేకుండెను. ఆ సభలు జరుపుట నిష్ఫలమని ఆయనకు తోచెను. వాదులాడుకొనుటయే కాని ఆ సమావేశములో ఏవియును నిర్ణయము కాలేదు. మహారాజ్ చెప్పిన విధముగనే ఆ సమావేశము లుండెనని ఆయనకు తెలిసివచ్చెను.

## మంత్రశాస్త్ర విషయము

బ్రహ్మావర్తములో మహారాజు నివసించుచున్నప్పుడు ఒకరోజు మంత్రశాస్త్ర విషయములను గూర్చిన ప్రశంస వచ్చెను. అప్పుడు మహారాజ్ "జారణ

మారణాది ప్రయోగములు చేసి ఇతరులను బాధపెట్టి, నాశనము చేయుట శ్రేయస్కరము కాదు. అట్లు చేసినవారు అధఃపాతాళమునకు పోదు"రని పలికిరి. అక్కడున్న వారిలో కొందరు "ఆ మంత్రము లంతటి పాపహేతువులైనచో మరి ఆ ప్రయోగములను గోరఖ్‌నాథ్ మొదలైన మహాసిద్ధ పురుషులెందుకు బోధించిరి? వారా ఉపాయములను తెలుపకుండినచో లోకులామార్గము నవ లంబించెడివారు కారు గదా!" యని తమ సందేహములను వెలిబుచ్చిరి. వారి సందేహములను తొలగించుటకై మహారాజ్ ఈవిధముగా చెప్పిరి. "వ్యాపారము చేయువాడు తన దుకాణములో మంచి వస్తువులు, చెడ్డవస్తువులు, విషపదార్థములు మొదలైన వానిని అమ్మకమునకు పెట్టుకొనును. అన్ని వస్తువులు మంచివే. మంచివాని చేతిలో పడి అవి మంచివిగా, చెడ్డవాని చేతిలోబడి అవి చెడ్డవిగా మారును. పిచ్చివాని చేతిలో పడిన కత్తి ప్రాణము తీయును. డాక్టరు చేతిలోని కత్తి ప్రాణరక్షణ చేయును. విషము ప్రాణము తీయును. ఆ ప్రాణము తీసెడి విషమే ప్రాణము పోవునపుడు పోసిన ప్రాణమును రక్షించును. దుకాణదారు వస్తువులను కొనుటకై వచ్చినవారిని నీవీ వస్తువునే తీసుకొనుమని ఆజ్ఞాపించడు. తీసుకొనువాడు తన కిష్టమైన వస్తువునే తీసుకొనును. ఈ ఉదాహరణలు మాదిరిగానే మహాపురుషులు అనేకవిధములుగా సాధనలుచేసి వానిని లోకమునకు చూపిరి. నీటిని పాలను వేరుచేసి పాలను మాత్రమే గ్రహించు హంసల మాదిరిగా, అందరును పరమహంసలై మంచిని మాత్రమే స్వీకరించవలయును. అట్లు చేయుటకు సంస్కారము సహకరించును. పూర్వజన్మ సుసంస్కారము వలన సుబుద్ధి జనించును. అది సత్కార్యాచరణకు హేతువగును. లోకశ్రేయమునకు శ్రీకారము చుట్టును. వెనుక జన్మలలోని దుర్వాసనల వలన దుర్బుద్ధులు పుట్టును. కుబుద్ధులు పాపకార్యములు చేసి అధోగతి చెందుదురు." ఆ విధముగా మహారాజ్ బోధించగా అందరి మనస్సులు సమాధానపడెను.

## నర్మదా తీర్థయాత్ర

బ్రహ్మావర్తములో గంగాతీరమున మహారాజ్ నివసించుచున్న ఆ సమయములో ఒకనాడు "నా తీరమునకు వచ్చి కొన్నాళ్ళు నివసించు"డని

నర్మదామాత కోరినట్లు వారికి దృష్టాంతమయ్యెను. కాని మహారాజ్ ఆ విషయ మంతగా పట్టించుకొనలేదు. తర్వాత ఒక విచిత్రము జరిగెను. ఒక బ్రాహ్మణున కేదో వ్యాధి వచ్చి శరీరముపై బొబ్బలెక్కెను. ఆ వ్యాధిచే నతడు తీవ్రముగా బాధపడుచుండగా ఎవరో వచ్చి "మహారాజ్ పాదతీర్థమును గ్రోలిన నీ వ్యాధి నివారించు"నని చెప్పిరి. ఆ బ్రాహ్మణునకు ఆశ కలిగెను. కాని మహారాజ్ పాదతీర్థమెట్లు తనకు లభించును? అతడెన్నియో ఉపాయముల నాలోచించు చుండెను. ఒక సమయములో మహారాజ్ మరగాలు వేసుకొని (కాళ్ళు వెనుకకు వచ్చునట్లు కూర్చుండి) ఏదో వ్రాసుకొనుచుండిరి. ఆయన పాదములు ఆ ప్రకారము వెనుకకున్న సమయములో, ఆ బ్రాహ్మణుడు మెల్లగా సందు చేసుకొని, మహారాజ్ వెనుకకు చేరి, ఆయన కాళ్ళపై ఛప్పున నీరుపోసి, ఆ తీర్థమును సంగ్రహించి, కొంతలోనికి పుచ్చుకొని, కొంత శరీరమునకు రాచుకొనెను. మహారాజ్ వెనుకకు మరలి చూచి "ఇట్లెందుకు చేసితి?"వని కోపించిరి. "నా వ్యాధి నివారణార్థ మెవరో చెప్పగా నేను బాధ భరించలేక ఇట్లు చేసితిని. నా అపరాధమును మన్నించు"డని అతడు దీనముగా వేడుకొనెను. ఆ బ్రాహ్మణుడు తమను తాకినందుకు వెంటనే మహారాజ్ గంగకు పోయి స్నానము జేసివచ్చిరి. కాని మహారాజ్ మనస్సుకు సమాధానము కాలేదు. ఆ బ్రాహ్మణుని చర్యవలన తమ శరీరమున కేమైనా బాధ కలుగునేమో? యని తలచి, విచారగ్రస్థులైరి. ఆ రాత్రి ఒక ఛండాలాంగన వచ్చి తమను ముట్టుకొన్నట్లు మహారాజ్‌కు దృష్టాంతమయ్యెను. వెంటనే మహారాజ్ లేచి దత్తప్రభువును ధ్యానించిరి. తెల్లవారి లేచుసరికి ఆయన శరీరము నిండా బొబ్బలు కనిపించెను. ఆ బ్రాహ్మణుని వ్యాధి దూరమై అది మహారాజుకు సంక్రమించెను. ఐదు శ్లోకములతో వారు గంగానదిని స్తుతించిరి. మహారాజ్ పడు బాధను చూచి జనులు ఏవైనను ఉపచారములను జేసెదమనగా "ఇది మరియొకరి ప్రారబ్ధభోగము. అనుభవము వలనగాని ఇది నశించదు. ఔషధము లెంత మాత్రము పనిచేయ"వని మహారాజ్ చెప్పిరి.

ఆరోజు రాత్రి మరల మహారాజ్‌కు దృష్టాంతమయ్యెను. "అర్హత లేనివానికి తీర్థమిచ్చుటచే ఈ బాధ నీవు అనుభవించవలసి వచ్చినది. ఇది నీవు బుద్ధి

పూర్వకముగా జేసినది కాదు. మూడురోజులు వరుసగా నీవు నర్మదా నదిలో స్నానము చేసినచో నీకు తిరిగి ఆరోగ్యము కలుగును" అని స్వప్నములో వారికి ఎవరో చెప్పిరి. ఆ దృష్టాంతమైన తరువాత మహారాజ్ గంగామాతకు నమస్కరించి, అనుజ్ఞ తీసుకొని నర్మదా తీరమునకు బయలుదేరిరి.

## ఊరు తగలబడిన కారణము చెప్పుట

అది మార్గశీర్ష్య మాసము. మహారాజ్ "జాళవన్" అను గ్రామము చేరిరి. అచ్చట నెల, నెలా పదిరోజులు నివసించిరి. ఆ సమయములో అచ్చటి విప్రులకు అరుణపాఠము చెప్పిరి. అక్కడ నుండి బయలుదేరి సారంగపూర్, మహత్‌పురా మున్నగు గ్రామముల మీదుగా హరణగాంవ్ జేరిరి. ఆ యూరిలో ఒక వింతయైన దృశ్యము కనిపించెను. ఆ గ్రామము పూర్తిగా తగులబడిపోయి యుండెను. కాని ఒక్క యిల్లు మాత్రము చెక్కు చెదరక ఉండెను. మహారాజ్ వెంబడియున్న వారు ఆ వింత దృశ్యము చూచి "ఇట్లుండుటకు కారణమేమిటి?" యని మహారాజ్‌ను ప్రశ్నించిరి. మహారాజ్ ఈ విధముగా చెప్ప దొడగెను. "ఒకనాడు మధ్యాహ్న సమయమున ఈ గ్రామములోనికి ఒక సాధువు భిక్షకు వచ్చెను. ఇల్లిల్లు తిరిగి మాధుకరము యాచించెను. ఎవరును పెట్టలేదు. అతడు క్షుద్బాధకు తట్టుకొనలేకపోయెను. మూడురోజుల నుండి ఆ సాధువునకు భోజనము లేకపోవుటచే మిగుల నీరసించి యుండెను. అట్టి స్థితిలో గూడ తనను పట్టించుకొనని ఆ గ్రామస్థులపై కలిగిన కోపము నాపుకొనలేక "ఈ గ్రామము దగ్ధమగు గాక!" యని శపించి వెడలిపోయెను. ఈ గ్రామములోని ఒక యింటి యజమాని పొరుగూరికి పోయి, తిరిగి వచ్చుచుండెను. దారిలో ఆయనకు ఈ సాధువు ఎదురుపడెను. సాధువును జూచి ఆ బ్రాహ్మణుడు నమస్కరించెను. ఆయన వలన విషయమంతయు గ్రహించి, అట్లు జరిగినందుకు మిగుల బాధపడి, గ్రామస్థుల అవివేక చర్యకు పశ్చాత్తాప పడెను. నీరసించిన ఆ సాధువునొక చెట్టుక్రింద కూర్చుండబెట్టి, వెంటనే యింటికి వచ్చి, మాధుకరము తెచ్చి ఆ సాధువునకు పెట్టెను. ఆ సాధువు తృప్తిపడి ఆ బ్రాహ్మణుని ఆశీర్వదించి వెడలిపోయెను. అతిథి సత్కార్య పుణ్యవిశేషము వలన, ఈ గ్రామములోని ఇండ్లన్నియు పరశురామప్రీతియైనను, ఆ బ్రాహ్మణుని యిల్లు మాత్రము

భద్రముగా నుండెను. మధ్యాహ్నవేళ యింటికి ఎవరు భిక్షకు వచ్చినను కులగోత్రాదులను విచారింపక యథాశక్తి భిక్ష యొసగవలెను. ఇది గృహస్థుని నిత్యధర్మము.” ఈ విధముగా మహారాజ్ చెప్పగా విని, అందరును మహారాజ్ త్రికాలజ్ఞతను జూచి అద్భుతాశ్చర్య హర్ష హృదయులైరి.

## నర్మదా లహరి స్తోత్రము

మునుముందుగా మహారాజ్ నర్మదాతీరమునగల “నే(నియ)మావర్” అను గ్రామము చేరుకొనిరి. నది దగ్గరకు పోయి నర్మదామాతకు నమస్కార పూర్వకమైన ప్రార్థనజేసి” నా స్వల్పాపరాధమున కెంతటి కఠిన శిక్ష విధించితి వమ్మా! నీ మాహాత్మ్యము వెల్లడించుటకు నేను తప్ప మరియెవ్వరును నీకు గోచరించలేదా తల్లీ?” అని విన్నవించి, ఆ యూరనే నివసించుచుండిరి. పూర్వము స్వప్నములో తమను ఆదేశించిన విధముగా మహారాజ్ మూడురోజులు వరుసగా నర్మదానదిలో స్నానమాచరించినంతనే వారి శరీరబాధ సమస్తము ఎవరో చేతితో తీసివేసినట్లు మటుమాయమయ్యెను. అప్పుడు వారు హర్ష పులకితాంగులై సభక్తికముగా ‘నర్మదాలహరి’ అను స్తోత్రము చేసి నర్మదానదికి నమస్కారము చేసిరి. అచ్చటి నుండి వారు ‘బ్రహ్మాణి’ అను ఘట్టము చేరిరి.

## నర్మదామాత అభిమానము

బ్రహ్మాణీ ఘట్టము నుండి వారు ప్రయాణము చేయుచుండగా కాలు బెణికి, నడుము పట్టెను. కాలుతీసి కాలు పెట్టలేక వారు బాధపడుచు అచ్చటనే ఒకచోట పరుండిరి. భిక్షా సమయమైనను వారు లేవలేకపోయిరి. మహారాజ్ స్థితిజూచి, నర్మదామాత ఒక బాలిక రూపమును ధరించి, వారి వద్దకు వచ్చి “మీకు భిక్షా సమయమైనది! లెండు. మీ బాధ నేను తొలగించెద”ననెను. వెంటనే చేతిలోనికి కొంచెము భస్మము తీసికొని, మంత్రించి మహారాజు కాలికి, నడుమునకు రాచి, “కాలు ఝాడించు”మని చెప్పెను. మహారాజు ఆ బాలిక చెప్పిన విధముగా చేయగనే వారికి బాధోపశమన మయ్యెను. “ఈ బాలిక నర్మదామాతయే గాని వేరు కా”దని భావించి మహారాజ్ ఆమెను స్తోత్రించిరి. ఆ బాలిక అదృశ్యమయ్యెను. నర్మదామాత పఠించిన బాధోపశమన మంత్రము మహారాజ్‌కు తెలిసిన మంత్రమే! అయినను తమ శక్తి నెన్నడును

వారుపయోగించుకొనని వారగుటచే తమ ప్రారబ్ధమును తామనుభవించదలచిరి. నర్మదామాతకు తమపైగల అభిమానమునకు కృతజ్ఞులైరి. ఆ తర్వాత భిక్షకై పోవలయునని బయలుదేరి ముందు చెప్పబోవు వృత్తాంతము వారికి స్ఫురించి నంతనే, భిక్షకు పోక ఆగిపోయిరి.

## నియమావర్‌లో భిక్ష

మహారాజ్‌కు స్ఫురించిన వృత్తాంత మేమనగా పూనాకు చెందిన బ్రాహ్మణు డొకడు వివాహితురాలైన తన కుమార్తెను వెంటబెట్టుకొని ఆ గ్రామమునకు వచ్చెను. ఆ బ్రాహ్మణుడు పరమలోభి. అతడు తన కుమార్తెకు పెండ్లి కాలేదని చెప్పి, ఒక బ్రాహ్మణుని దగ్గర కొంత మొత్తము కన్యాశుల్కముగా గ్రహించి, ఆ పిల్లనతనికిచ్చి పెండ్లిజేసెను. ఆ పిల్లను పెండ్లి చేసుకొన్న బ్రాహ్మణుడు కొన్ని రోజులకు మరణించెను. ఆ పిల్లకు శిరోముండనము కావించిరి. కొంతకాలము గడచెను. ఆ పిల్ల మొదటి మనువు మగడు తన భార్య ఆ గ్రామములో నున్న విషయము తెలిసికొని, తన భార్యను తాను తీసికొని పోవలయునని పూనా నుండి ఆ యూరు వచ్చెను. ఆ గ్రామములో "గణుభయ్యా" అను పేరుగల పిసినారి ఒకడుండెను. అతనికిని, మరణించిన ఆ పిల్ల మగనికిని ఏదో డబ్బు రూపమైన వైరముండెను. తన ద్రవ్యము రాబట్టుకొనుటకై అతడు పూనా నుండి వచ్చిన ఆ పిల్ల మొదటి మనుము భర్తను జూచి, ఆ పిల్లను తన స్వాధీనము లోనికి తీసుకొనెను. ఆ పిల్లను తిరిగి జుట్టు పెంచుకొనుమని చెప్పెను. మొదటి మగని దగ్గర కొంత ధనము తీసుకొని ఆ పిల్లను అతని కప్పగించెను. ఆ వృత్తాంతమంతయు మనస్సున స్ఫురించగా, అచ్చటి బ్రాహ్మణులు భ్రష్టులని తలచి, ఆ గ్రామమునకు భిక్షకు పోవుటకు మనస్సు సమాధానపడక, ఒక తరుమూలమున మహారాజ్ కూర్చుండిరి.

అప్పుడు పూర్వము మాదిరిగా నర్మదామాత ఒక బాలిక రూపము వహించి, వారి దగ్గరకు వచ్చి 'మీరీ బ్రాహ్మణ అగ్రహారమున భిక్ష గ్రహింపక నిట్లు కూర్చున్నారేమి?" యని ప్రశ్నించెను. అప్పుడు మహారాజ్ "ఇక్కడి బ్రాహ్మణుల దగ్గర భిక్ష తీసుకొనుటకన్నను నర్మదాజలము పానము జేసి యుండుట మంచి"దనిరి. ఆ మాటలు విని నర్మదామాత "మహారాజ్!

నియమావర్ అను మా గ్రామము ఇక్కడకు దగ్గరలోనే యున్నది. మా ఇంటిలో భిక్ష తీసుకొను"డనెను. "నాకు ఒక ఇంటిలో భిక్ష నడవదు. మూడిండ్లు కావలయు"నని మహారాజ్ పలికిరి. "అక్కడ పదునేడు దక్షిణాది బ్రాహ్మణుల యిండ్లుగల"వని ఆ బాలిక పలికి అదృశ్యమయ్యెను. ఆ బాలిక చెప్పిన ప్రకారము మహారాజ్ నియమావర్ పోయి భిక్ష గ్రహించిరి. అచ్చట విచారించగా ఆ బాలిక నుడివినట్లు పదునేడు బ్రాహ్మణ్య గృహములుండెను. కాని ఆ బాలిక మాత్రమెచ్చటను కనిపించలేదు. నియమావర్ లోని వారు తమ గ్రామములో మహారాజ్ నివసించుడని బలవంతము చేయుటచే వారి మాట కాదనలేక మహారాజ్ కొన్నిదినములచ్చట నివసించిరి. నియమావర్ గ్రామము నర్మదానది నాభిస్థానము. అచ్చట సిద్ధేశ్వరమను పేరుగల సుప్రసిద్ధ దేవాలయమొకటి యుండెను.

## గణపతి బువా

నియమావర్‌లోని బ్రాహ్మణులకు ఆచారధర్మములు బోధించి మహారాజ్ ఉజ్జయినికి చేరిరి. అచ్చట గణపతి బువా అను పేరుగల గణపతి ఉపాసకు డుండెను. ఆయన సత్యవినాయక వ్రత గ్రంథమును గూడ రచించెను. ఏదో కొంత యోగాభ్యాసము చేయుచున్నను యోగమంతయు తనకు వచ్చునన్న గర్వమాయన కుండెడిది. అందరి యెదుట అతడా గర్వమును ప్రదర్శించు చుండెను. ఆ బ్రాహ్మణునకు మహారాజ్ విషయము తెలియనందున, తన యోగాభ్యాస శక్తి ఆయన ముందు చూపించి ప్రశంసల నందవలయునని వారిని తమ యింటికి ఆహ్వానించెను. మహారాజ్‌ను తాను యోగాభ్యాసము చేయు గదిలోనికి తీసుకొనిపోయి, తాను చేసెడి యోగవిధులను వివరించసాగెను. మహారాజ్ అతడు చెప్పెడి మాటలన్నియు సావధానముగా వినుచుండిరి. ఆ బ్రాహ్మణుడు ఒక పొడవైన గుడ్డపేలికను కడుపులోనికి మ్రింగి, కొంతసేపటికి దాని కొస పట్టుకొని బయటికి తీసెను. బయటకు తీసిన గుడ్డపేలిక నెత్తుటితో తడిసియుండెను. అదిచూచి "ఈ వస్త్రము రక్తముతో తడిసినదేమి? యోగము తెలిసిన వానికిట్లు కారాదు కదా?" యని మహారాజ్ అతనిని ప్రశ్నించిరి. ఆ మాట వినగనే యోగశాస్త్రములో మహారాజ్‌కు గల అధికార మతనికి తెలిసి వచ్చెను. అంతటి మహానుభావుని ఎదుట హనుమంతుని

ముందు కుప్పిగుంతులన్నట్లు తన గొప్పతనము చూపవలయునని భావించితిని గదా!” యని తన అవివేకమునకు సిగ్గుపడెను. తలవంచుకొని “నా అజ్ఞానమును క్షమించు”దని వేడుకొనెను. ఆ బ్రాహ్మణుని గర్వమంతయు నశించి, నిజముగా నతడు పశ్చాత్తాప పడుచున్నాడని గ్రహించి, వాత్సల్యముతో అతనికి కొన్ని యోగవిద్యా రహస్యములు మహారాజ్ బోధించిరి. ఆ రహస్యములతోబాటు ధౌతిప్రక్రియా సమయములో రక్తముతో తడువకుండ, మ్రింగిన గుడ్డపీలిక నెట్లు బయటకు తీయవలెనో? ఆ బ్రాహ్మణునకు తెలిపెను.

## నర్మదాబాణము

ఉజ్జయిని నుండి బయలుదేరి మహారాజ్ ఓంకారేశ్వరము చేరుకొనిరి. ఆ ప్రదేశము ఒక సుప్రసిద్ధ జ్యోతిర్లింగ క్షేత్రము. మహాకాళేశ్వర దేవాలయము సమీపమున ధావరికుండమున్నది. దానిని నర్మదా యోనిస్థానమందురు. ఆ కుండములో స్నానము చేయుటకై మహారాజ్ దిగిరి. ఒక మునకతీసి పైకి లేచునప్పుడు దోసిటితో నీరు గ్రహింపగా అందులో నర్మదాబాణము (సాల గ్రామము) కనిపించెను. ఆ సమయమున శంకరుడు భిల్ల రూపముతో వారికి కనిపించి “దీనిని మీరు పూజించెదరా?” యని ప్రశ్నించెను. అప్పుడు మహారాజ్ “సన్యాసులు దీనిని పూజించరు. సుందరముగా నున్నది కనుక చూచుచున్నా”నని చెప్పిరి. “పూజించుటకు పనికిరానప్పుడు అది ఇంకను చేతులలో నెందుకు? నదిలో పడవేయు”దని అతడు పలికెను. ఆ భిల్ల యువకుని వచనానుసారము మహారాజ్ నర్మదాబాణమును నదిలో విడిచిపెట్టిరి. ఓంకారేశ్వరములో మహారాజ్ ముప్పది మూడురోజులుండిరి. ప్రతిదినము పురాణము చెప్పుచుండిరి. రాజోద్యోగియైన బలవంతరావ్‌కు నిత్యబ్రహ్మకర్మలు బోధించిరి. అచ్చట నుండి వారు మండలేశ్వరము, మహేశ్వరము మున్నగు గ్రామముల మీదుగా “పేట్‌లాడ్” చేరిరి.

ఓం నమో శ్రీ దత్తాత్రేయాయ

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

పదునేడవ అధ్యాయము సంపూర్ణము.

(సశేషం)

# విశ్వహృదయార్చన

(గత సంచిక తరువాయి)

**భావం – బాహ్యం :**

**పట్టుబట్టి నీవు పదములు ధ్యానింప**
**పట్టనట్టు తాను పలుక కుండు**
**పట్టు విడువ పదము గట్టిగా పట్టాలి**
**శాంతి ప్రేమదాయి! సత్యసాయి!** (శాం॥ప్రే॥44)

నవవిధ భక్తి మార్గములలో పాదసేవనము చెప్పబడినది. "దర్శనం పాపనాశనం; సంభాషణం సంకట నాశనం; స్పర్శనం కర్మ విమోచనమ్". దివ్య పాదార విందములను స్పృశించుట మహద్భాగ్యం. విశ్వమంతటనీ భరించేది ఆ పాదములే. మానవుని దేహభారమంతయు భరించేవి పాదములే కదా! ఆ విధంగానే విశ్వ విరాట్స్వరూపుని దివ్యపాద పద్మములు విశ్వమునంతటనీ భరిస్తాయి.

బ్రహ్మమునకు ప్రతీక పాదములు. "బ్రహ్మ కడిగిన పాదము, బ్రహ్మము తానైన పాదము" అనంత శక్తికి ప్రతీక భగవంతుని పాదములు. చతుర్విధ పురుషార్థములలో ధర్మము – పాదము; కాళ్ళు అర్థము – ఉదరము – కామము; శిరస్సు – మోక్షము; పాద నమస్కారము పాదపూజ పాద సేవనము పాదుకా పూజ – అర్పణభావంతో, శరణాగత తత్త్వంతో ఆచరించాలి. పాద స్పర్శవలన భగవంతుని శక్తి మనలో ప్రకాశిస్తుంది.

పట్టుదలతో మనం గనుక సాయి పాదాలను మనసులో ధ్యానిస్తూ పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో సాయి దర్శనార్థం వరుసలలో కూర్చుంటే అదృష్టవశాత్తు మొదటి లైనులో కూర్చునే సదవకాశం కలిగినప్పుడు సాయి దగ్గర నుంచి దర్శనమిస్తూ ఏమి పట్టనట్లు ఎఱుగనట్లు ముందుకు సాగుతూనే ఉంటారు. ఒకానొక శుభదినాన్ని వేచి వేచి నిశ్చలమైన మనస్సు ఆగకుండా వారి పదములు ధ్యానిస్తుంటే పాదాలు తాకి నమస్కారం చేసుకొనే సద్భాగ్యం

కలిగిస్తారు బాబా. ఆ దర్శన భాగ్యం తలచుకొని దివ్యానుభూతి పొందితే మంచి ఫలితం దక్కుతుందని, తమనించి మనకు వచ్చిన శక్తి మనల్ని అంటుకుని ఉంటుందని, మనల్ని శక్తివంతుల్ని చేస్తుందని బాబా పలుకుతుంటారు. ఆ విధంగా పొందిన శక్తితో ధ్యానంలో మరొక మెట్టు ఎక్కడానికి తోడ్పడుతుంది. ఇటువంటి సమయంలో పట్టినపట్టు విడువకూడదు. ఆ వీడని పట్టు ఉన్నత అధ్యాత్మ శిఖరాల నందుకొందుకు తోడ్పడుతుందని భావించవచ్చును. ఆ పాదాలను పట్టువిడవకుండా గట్టిగా పట్టుకోవాలి. భౌతికంగా వారి పాదాలను పట్టుకోవడం కాదు. అంతరంగంలో ఆ పాదాల్ని భద్రపరచుకొని నమ్మకం విశ్వాసం పెంపొందించుకుంటూండాలి. భగవాన్ సత్యసాయి ఒకానొక సందర్భంలో చెప్పిన సీసపద్యాన్ని పరిశీలిద్దాం.

**సీ॥ పట్టినదేదియో పట్టనే పట్టితివి**
**పట్టు నెగ్గిడి దాక అట్లే ఉండు**
**అడిగినదేదియో అడుగనే అడిగితివి**
**అడిగినదిడుదాకా విడువకుండు**
**తలచినదేదియో తలచనే తలచితివి**
**తలుపుతీరెడు దాకా పోవకుండు**
**పోరుపడలేక తానైన బ్రోవవలయు**
**ఒడలు తెలియక నీవైన అడుగవలయు**
**అంతియె కాని ఇంత నీ యంత నీవు**
**తిరిగిపోవుట భక్తుని దీక్షగాదు.**

భగవంతుడి పట్ల అత్యంత భక్తి విశ్వాసాలు కలిగి యుండాలని ఆయన అడిగినది ఇచ్చేవరకు నిరంతరం కాలంతో పని లేకుండా కోరిన దానిని కూడా మరచి సాధన చేసిననాడు ప్రశాంత చిత్తంతో మౌనంలో ఆయన దర్శనమయి తీరుతుంది. అటువంటప్పుడు కోర్కె తీరడం పెద్ద సమస్య కాదు. అవన్నీ వాటంతట అవే ప్రాప్తిస్తాయి. అంతరంగం చూస్తాడు భగవంతుడు. భక్తిని గమనిస్తుంటాడు.

ద్వాపరయుగంలో శ్రీకృష్ణ పరమాత్మ గజేంద్రుణ్ణి రక్షించినట్లుగా హృదంతరముల నుండి వచ్చిన పిలుపు విని ''సిరికిం చెప్పడు శంఖచక్రయుగమున్ చేదోయి - - - సంధింపడు" అంటూ పరుగున వచ్చి గజేంద్రుణ్ణి కాపాడినాడు. అనేక నామాలతో భక్తి భావంతో పిలచినా పరమాత్మ రాలేదు. కర్మ పరిపక్వం చెందిన గజేంద్రుడు మొసలి బాధపడలేక "లావొక్కింతయు లేదు, ధైర్యంబువిలోలంబయ్యెన్ - -" అంటూ తన అశక్తత చాటి "నువ్వ తప్ప నన్నెవ్వరూ రక్షించలేరు" అంటూ రక్షించవా! కావరావా! అని వేడిన వెంటనే పరమాత్మ హుటాహుటిన వచ్చాడు. ఏ విధంగా పిలవాలో ఆ విధంగా పిలిస్తేనే భగవంతుడు వేంచేస్తాడు. ఆయన పాద పద్మములు పట్టుకున్నంత మాత్రాన్న సరిపోదు. ఆ పాదాలను నిరంతరం ధ్యానిస్తూ మననం చేసుకుంటూ, ఎట్టి పరిస్థితుల్లోనూ భక్తి భావం సడలి వదలకుండా ఉండే స్థితిని పొందాలి. గజేంద్రుని వలె పట్టు విడవకుండా ఆర్తితో వేడుకుంటేనే ఆయన మనల్ని పట్టించుకుంటాడు. లేని యెడల తనకేమి పట్టనట్టే వ్యవహరిస్తాడు. భగవంతుడు భావప్రియుడు - బాహ్యప్రియుడు కాదని మరొకమారు ఈ పద్యంలో విశ్వం మాష్టారు వివరించారు.

**పట్టుబట్టి విడువ పలుకదురా సాయి**
**పట్టుబట్టకున్న పలుకడసలు**
**పట్టు విడువరాదు పలుకవలయునన్న**
**శాంతి ప్రేమదాయి! సత్యసాయి!** (శాం॥ప్రే॥10)

పట్టుదలతో పట్టినపట్టు విడువకుండా ఉంటేనే సాయి పలుకుతాడు. అసలు పట్టు పట్టకపోతే, ఆ పట్టుదల లేకపోతే అసలు పలుకడు. భగవంతుణ్ణి కొలవాలంటే భక్తి ప్రధానం. భక్తి భావం ఉదయించాలంటే ఆయన చరిత్ర చదవాలి. లీలలు, మహిమలు అనుభవించి వారి అనుభవాలు ఆకళింపు చేసుకొని ఆనందాన్ని అనుభవించాలి. చూడాలన్న తృష్ణ జనించేది అప్పుడే. చూడాలనుకొని వార్ని భౌతికంగా దర్శిస్తే కొంత మార్పు కలుగుతుందని చెప్పవచ్చును. ఇంకా ఇంకా వారిని గురించి, వారి బోధల్ని గురించి తెలుసుకొని ఆచరించడానికి ప్రయత్నించాలన్న జిజ్ఞాస కూడా కలుగవచ్చు. ఆ క్రమ

పరిణామ దశలో, మంచి దిశగా పయనం సాగిస్తూ పట్టుదలతో పాదములను గట్టిగా పట్టుకొని నిశ్చలస్థితికి రావాలి. ఈ విధంగా సాధన ప్రారంభమై చిలవలు పలవలుగా అల్లుకుని పోతూ మధురమైన దివ్యానుభూతుల్ని పొందుతూ , ఆనందంగా జీవితం సాగిస్తూ ప్రేమతో సేవలలో ప్రవేశిస్తే, పట్టు విడవకుండా ఆయన చెప్పినవి ఆచరిస్తే అప్పుడు సాయి పలుకుతాడు. బాబా అంటే ఏం బాబు! నేనున్నాను నీకేమి ఫర్వాలేదని అభయం పలుకుతాడు.

అందుచేత భగవంతుణ్ణి పట్టుకుందుకు పట్టుదల కావాలి. నియమ నిష్ఠలతో అనుష్ఠానం కొనసాగిస్తూ భగవంతుణ్ణి పూజించడం మిగిలిన సమయమంతా ఎవరి రంగాలలో వారు తమ వృత్తికి భంగం కలుగకుండా నివృత్తి మార్గంలో పయనించిననాడు సాయి అంటే ఓయి అంటూ వారి వెంట జంట కంట ఇంట భగవాన్ ఉంటారు. “ఏ పూజలు చెయ్యకపోయినా వృత్తి ధర్మాన్ని నిజాయితీగా నిర్వర్తిస్తూ ధర్మపదం వైపు అడుగులు వేసి పురోగమిస్తున్న వారందర్ని హృదయంలో పెట్టుకొని ఎల్లవేళలా చూసుకుంటుంటాను” అని విశ్వంజీ అభయం పలికారు.

**మనసులోన మంచి మాటలందున మంచి**
**నడతలందు మంచి పొడమకున్న**
**సాయి నిన్ను మెచ్చి సంతోషమిచ్చునా?**
**శాంతి ప్రేమదాయి! సత్యసాయి!** (శాం॥ప్రే॥11)

మన మనస్సు మంచి భావాలతో నిండి ఉండాలి. మనసులోని భావాన్ని వెల్లడించడమే మాట. మన మాటలు హృదయపూర్వకంగా ఉండాలి. అలాగే మన నడవడిక కూడా మంచిదై ఉండాలి. వినయ భావం, ప్రేమ, సహనం ఇవన్నీ మన నడతలలో నిండి ఉండాలి. ప్రేమతత్త్వమే మానవత్వం గనుక తోటి వారి పట్ల వినయంతో కూడిన భావాలు కలిగి ఉండాలి. ఈ శతకంలో మరొకచోట ఈ మహాకవి తోటి వారినెప్పుడు తూస్కారముగ చూడకు’ అన్నారు. మనస్సులో ద్వేషభావం కలిగి బయటకు వినయం నటిస్తే భగవంతుడు మెచ్చడు. సర్వం ఎఱిగిన సర్వజ్ఞుని ముందు ఏ నటనలు పనకిరావు. కాబట్టి మనసులోని

మాటలు మంచివిగా నోటి నుంచి వెలువడాలి. అలాగే మన నడతలు కూడా మంచివిగా పొడకట్టాలి. అలాంటప్పుడు సాయి మెచ్చి సంతోషాన్ని కలుగజేస్తాడు. అన్యధా ప్రవర్తిస్తే ఆ విధమైన సంతోషం దివ్యపురుషుని నుంచి అందుకోలేము. ఆ దివ్యమైన సంతోషాన్ని అనుభూతి పొంది అనుభవిస్తే ఆ ఆనందమే వేరుగా నుంటుంది.

మనస్సు, మాట, నడవడి, ఈ మూడు మంచిగా ఉండాలి. మనస్సు మంచిది కాక, మాట మంచిది కాక చెప్పేది చేసేది వేర్వేరుగా నుండిన సాయి మెచ్చి సంతోషమిస్తాడా? అని విశ్వం.జీ మానవాళిని ప్రశ్నిస్తున్నారు. సాయి మెచ్చడు అన్నదే జవాబు. ఒక సందర్భంలో విశ్వంజీ అన్నమాట – భగవంతుని దగ్గర, లేదా గురువు దగ్గర ఏమి దాచకూడదు. Open Book లా ఉండాలి. రహస్యాలు నాకెప్పుడూ ఉండవు" అన్నారు స్వామి.

**మౌన మందిరాన మసలుచుండును సాయి**
**కనుల బడక నిలిచి కథలు జూపు**
**మనసు దెల్పు గాథ మనిషినే మార్చుగా!**
**శాంతి ప్రేమదాయి! సత్యసాయి!** (శాం॥ప్రే॥7)

సత్యసాయి మౌన భూమికలో నుంటారు. హితంగా మితంగా అత్యవసర పరిస్థితులలో తప్ప వారు మాటలాడరు వారి నోటి వెంట వచ్చే మధురమైన అమృత వాక్కులు అక్షర సత్యాలు! వేద వాక్కులు. వేద పురుషుని నోటి వెంట వేద వాక్కులే వినిపిస్తాయి. ఒక చూపు చూసినా, ఒక చిన్న పలకరింపు, పలుకరించినా ఎంతో అర్థం ఇమిడి ఉంటుంది. వ్యక్తుల అవసరాలను బట్టి బాధల యొక్క తీవ్రతను బట్టి, వత్తిడి అలసట కలిగియున్న వ్యక్తులకు మంచి ఊరట కలిగించడం కోసం ఒక చిన్న మాటతో పలుకరింప జేసి అనుగ్రహిస్తారు. విశ్వంజీ కూడా ఇదేవిధంగా చేయడం మనందరకు అనుభవమే.

సత్యసాయి మౌనం వహించి మన మనస్సులను కరిగిస్తారు. మనస్సులు మార్చివేస్తారు. మౌనంలోనే మహిమను చూపి ఆకర్షించుకొని మనకి ఉల్లాసాన్ని కలిగిస్తారు. ఆయనను నిలకడగా ధ్యానం చేసుకొనే స్థితికి మనం రావాలంటే

వారు ఏదో ఒక మహిమ చూపిస్తారు లేదా మౌనంగా మన మనస్సు మారుస్తారు. ఆ విధంగా వారి దివ్యత్వాన్ని గ్రహించ గలిగేలా చేస్తారు. "మహిమలనేవి విజిటింగ్ కార్డ్స్ వాటి ద్వారా మనిషి మారిపోతాడు. జీవితమే మారిపోతుంది. మహిమలు చెయ్యడం అవతార మూర్తికి, యోగికి సహజం. మహిమలనేవి లేవు. ఏ విద్యలో నైపుణ్యం ఉన్నవారు ఆ విద్యను ప్రదర్శించి మనలను ధన్యుల్ని చేస్తారు. డాక్టరు శస్త్ర చికిత్స చెయ్యడం, యోగులు నీటిమీద నడవడం ఇవన్నీ సహజం" అంటారు విశ్వంజీ. ద్వాపరయుగంలో కృష్ణలీలలెన్నో చూసినట్లే ఈ కలియుగంలో ఈ కాలమాన పరిస్థితుల కనుగుణంగా సాయి కృష్ణుని లీలలు చూస్తున్నాము. మహాయోగి విశ్వంజీ చేసిన, చేస్తున్న లీలలు గమనిస్తున్నాము. సాయి మాటల్లో, విశ్వగురువు మాటల్లో ప్రేమ తొణికిసలాడుతుంది. దయ సాగరమై ప్రవహిస్తుంది. వాత్సల్యం కోటి తల్లుల ప్రేమ నందిస్తుంది. కరుణకే నిధి వారు, గనుక మానవుని మనసు ఆనందంతో అలలపై తేలినట్లు తేలికై గమ్యమేమిటో మానవుడుగా తాను ఏమి సాధించాలో కూడా మార్గ నిర్దేశనం చేసిన అనుభూతిని కలిగిస్తుంది.

"మనస్సు దెల్పు గాథ మనిషినే మార్చుగా" మనస్సు తెలిపే గాథ మనస్సును మనకు ఎఱుక పరుస్తున్నప్పుడు ఇదికాదు, ఇది కాదు, నీవు ఉండవలసిన పద్ధతి, ఇదికాదు అన్న అవగాహన కలిగిస్తారు మౌనంగా. పరివర్తన తీసుకుని వస్తారు. స్వామి ఎన్ని సన్నివేశాలు సృష్టించినా వాటిని అర్థం చేసుకోలేక సతమతమగుతున్నావే! ఈ సన్నివేశాల వల్ల 'నీవు మారాలి' అని తెలియజేయడానికి, "మనస్సు దెల్పు గాథ మనిషినే మార్చుగా ; శాంతి ప్రేమదాయి! సత్యసాయి!" అని విశ్వంజీ వివరించారు.

**చేయు కర్మమందు జేర్చి యుంచు మనస్సు**
**మనసు జేరి మాట మసల వలయు**
**మూడునేకమొంద మోక్షమ్ము సిద్ధించు**
**శాంతి ప్రేమదాయి! సత్యసాయి!** (శాం॥ప్రే॥109)

ఈ పద్యంలో విశ్వంజీ త్రికరణ శుద్ధిని గురించి ప్రస్తావించినారు. ప్రతివ్యక్తికీ

త్రికరణ శుద్ధి అవసరమంటున్నారు. మనసునందలి మాట ననుసరించి కర్మలుండాలి. మనసు, మాట, క్రియ ఈ మూడు ఏకం కావాలి. సృష్టి, స్థితి, లయ కారకాలయిన ఈ మూడు స్థూల సూక్ష్మ కారణ దేహాలనబడు ఈ మూడు బ్రహ్మ విష్ణు మాహేశ్వరులకు చిహ్నాలుగా తోచుచున్నవి. అట్టి స్థితియే దత్తాత్రేయని స్థితి.

చెప్పేది, చేసేది, ఆచరించేది ఒకదాని కొకటి పొంతన లేకుండా ఉండకూడదు. బాబా తమదైన ఒకానొక దివ్యోపన్యాసంలో ఈ విధంగా అన్నారు. "దయతో మాట్లాడటం వలన ఆత్మ విశ్వాసము, సానుభూతితో ఆలోచించడం వలన సంపూర్ణ తత్త్వము, స్నేహభావంతో పంచుకోవడం వలన ప్రేమ కలుగుతాయి. మాటే మనిషికి ప్రాణము. మాటే సుఖ దుఃఖములకు మర్మము – మాట విలువను పోగొట్టుకొంటున్నాము. కనుక మాధవునికి దూరమై పోతున్నాము. స్వామికి ఎవరిపైనా కోపము లేదు. నిరంతరం ప్రవహించే ప్రేమ స్వామి స్వభావము. స్వామి మాట్లాడలేదని మీరు తపిస్తున్నారు. కాని మీ వలె మాట పోగొట్టుకోవడం నాకు ఇష్టం లేదు. నామాట చాలా విలువైనది. నా మాట వజ్రాల మూట. వేదాల ఊట, పూల బాట, మాట్లాడిన తర్వాత ఆ మాటను నిలబెట్టుకోవాలి. ఎవడు స్వామి మాటలకు విలువనిచ్చి వాటిని ప్రాణపదములుగా భావించుకొంటాడో వాడు మాత్రమే స్వామికి సన్నిహిత సంబంధం కలవాడై ఉంటాడు" అని విశ్వంజీ అంటుంటారు. "నేను మాట అంటే మాటే. ఇచ్చిన మాట తప్పను. ఆ మాట నిలబెట్టుకొందుకు ఎంతైనా శ్రమపడతాను. వస్తానంటే వచ్చే తీరుతాను." మన సమస్యలు, రుగ్మతలు విన్నవించినప్పుడు కూడా "ఏం ఫర్వాలేదు. అంతా బావుంటుంది" అని అభయం పలికితే అది జరిగే తీరుతుంది. కొంత సమయం పట్టవచ్చు.

(సశేషం)

***(కీ.శే. వి. రత్నమోహిని రచించిన విశ్వ హృదయార్చన నుండి సేకరణ)***

# ఆత్మబంధువు

## విశ్వగురుచరితామృతం

(గత సంచిక తరువాయి)

గురుకటాక్షం అంతగా ఉంది కాబట్టే గురుదత్త ఆజ్ఞానుసారం, మాస్టరుగారిని వెదుక్కుంటూ గురుమహారాజ్ జడ్చర్ల వచ్చారు. గురుకటాక్షం అంతగా ఉంది కాబట్టే గురుమహారాజ్ దత్తాత్రేయ వాడీకర్ గారు తమ దివ్యశక్తిని మాస్టరుగారికి ధారపోయటం జరిగింది. గురుకటాక్షం అంతగా ఉంది కాబట్టే మాస్టరుగారు అచిరకాలంలోనే 'విశ్వయోగి'గా మారి విశ్వమానవ సమైక్యత కోసం ప్రస్థాన భేరి మ్రోగించటం జరిగింది. భక్త కల్పద్రుమంగా, ప్రేమ స్వరూపంగా విరాజిల్లుతూ ఈనాడాయన సాక్షాత్తు విశ్వదత్తులై వెలుగొందటం జరిగింది. ఓం శ్రీం విశ్వదత్తాయనమః.

**యోగసాధన :** జీవాత్మను పరమాత్మతో అనుసంధానం చెయ్యడాన్ని 'యోగ'మంటారు. కర్మ, భక్తి, జ్ఞాన మార్గాల్లో మనం ఏ మార్గాన్ని అనుసరించి నప్పటికి, ఆ సాధన యోగంగా మారాలి. అప్పుడే ఆ సాధన ఫలిస్తుంది. మనస్సు స్థిరపడకపోతే ఏకాగ్రత కుదరదు. మనస్సుకు ప్రాణానికి లంకె ఉంది. ప్రాణం చంచలంగా ఉంటుంది. ప్రాణాయామం ద్వారా మన ప్రాణాన్ని స్థిరపరచు కోవటం చేతనైతే, మన మనస్సు కూడా స్థిరపడుతుంది. ఈ స్థిర మనస్సుకే "చిత్త"మని పేరు.

మనం భగవంతుడు ఏ వైకుంఠంలోనో, ఆయన్ను పట్టుకోవాలని తీర్థాల్లో, మందిరాల్లో, చర్చీల్లో, మసీదుల్లో వెతుకుతాం. అంతేగాని మన శరీరంలోనే ఉన్న ఆ భగవంతుణ్ణి అన్వేషించాలని అనుకోము. నేల విడిచి మనం సాము చేస్తున్నాం కనుకనే ప్రయోజనం పొందలేక పోతున్నాం. మనలో ఉన్న ఆ పరమాత్మను ఎలా దర్శించాలో మన సనాతన ఋషులు చెప్పారు.

సగుణారాధన (విగ్రహపూజ) తప్పనిసరిగా చేయమనే చెబుతుంటారు. సాకారపూజ చేస్తుంటే క్రమక్రమంగా భగవంతుడి మీద భక్తి శ్రద్ధలు

పెంపొందుతూ, సమయం వచ్చినప్పుడు ఆ సాధన మానసికంలోకి మారుతుంది. ఈ మార్పు రావటానికి సాధకుడికి కొన్ని రోజులు పట్టవచ్చు. లేదా కొన్ని జన్మలు పట్టవచ్చు. మన సనాతన ఋషులు నిర్గుణ బ్రహ్మను (పరాశక్తిని) ధ్యానం ద్వారా వివిధ రూపాల్లో దర్శించి, ఆ రూపాల నన్నింటిని వెల్లడించారు. గుళ్ళల్లో విగ్రహాల క్రింద యంత్రరూపంగా తమ ఆత్మశక్తిని నిక్షిప్తం జేసి, దేవాలయాల్లోకి పోయి పూజలు చేయమని ఆదేశించారు. సామాన్య జనానికి ఆత్మను గురించిన జ్ఞానముండదు.

సాధనా మార్గంలో విగ్రహపూజ, తీర్థయాత్రలు, నోములు, వ్రతాలు, నదీస్నానాలు, జపాలు, స్తోత్రాలు, అతిథి సేవ, దానధర్మాలు ఈ మొదలైనవన్నీ బాహ్యసాధనకు సంబంధించినవి. ఆత్మకర్మ ఒక్కటే అంతరంగ సాధన. మానవుల్లో అధికశాతానికి అంతరంగసాధన స్పృహ ఉండదని మన సనాతన ఋషులకు తెలుసు కనుక వాళ్ళు ఆగమాలను వెలయించి బాహ్య పూజను ఎక్కువగా వ్యాప్తి చేసారు. అర్థకామాలతో కూడివున్న లోకం ఈశ్వరుణ్ణి గూర్చి ఆలోచించలేదు. ఏ జన్మలోనో జీవుడు మానసిక సాధనలోకి మారిపోతాడు. పరిపూర్ణ మానవత్వాన్ని హృదయం నిండా నింపుకొని, త్రికరణ శుద్ధిని సాధించి, అంతరంగం వైపు దృష్టిని మళ్ళిస్తాడు. అన్ని లోకాలు, అన్ని తీర్థాలు, అన్ని దైవాలు తనలోనే ఉన్నవని, అవి తనకంటే వేరుగావని తెలుసుకొని ఆత్మానందంలో ఓలలాడుతుంటాడు. తన మనస్సును విశ్వ మనస్సుతో అనుసంధానం చేసి భగవత్ స్వరూపంగా మారతాడు.

మానవుడు త్రికరణ శుద్ధితో, నిరంతరం సాధన చేసి దివ్యత్వాన్ని ఎట్లా సాధించగలడో శ్రీకృష్ణ పరమాత్మ మనకు విశదీకరించినట్లే, మానవుడు ఇంద్రియ నిగ్రహం చేత, స్వార్థరాహిత్యం చేత, త్యాగనిరతి చేత ధ్యానస్థితుడై విశ్వశక్తిని (Cosmic Electro - Magnetic Power) కైవసం చేసుకొని విశ్వయోగిగా, దత్తాత్రేయ స్వరూపంగా ఎట్లా మారుతాడో విశ్వం మాస్టరుగారు తమ జీవితం ద్వారా మనకు వెల్లడించారు. ఈ లోకంలో ఒక సగటు మనిషిగా పుట్టి, ఆధ్యాత్మికంగా ఇంత అత్యున్నత స్థితికి చేరుకోవడానికి ఆయన అడుగు అడుక్కి ఎన్ని అవాంతరాల నెదుర్కొన్నారో, ఎన్ని బాధలు పడ్డారో, ఎన్ని

అవహేళనలు భరించారో, ఎంత పట్టుదలతో, ఎంత ఆత్మవిశ్వాసంతో సాధనా మార్గంలో ప్రయాణం చేశారో – వారు వ్రాసిన ఈ గేయం చూస్తే మనకు బోధ పడుతుంది.

**నా ధ్యేయం, నా గమ్యం మరువను మరువను ఎన్నటికి**
**మరచి నడువను ఎన్నటికి**
**నే వేసే ప్రతి అడుగు నీ వైపే సాగాలి**
**నే పలికే ప్రతిమాట నీ మాటే కావాలి**
**నా ధ్యానం, నా ప్రాణం సర్వస్వం నీవేలే ! ॥ నా ధ్యేయం ॥**

**ఎన్ని తుఫానులు కమ్ముకొచ్చినా**
**ఎంతటి వేదన మదిలో రేగినా**
**ఎందరెంద రవహేళన చేసినా**
**ఆగదు ఆగదు నా పయనం**
**ఆగదు ఆగదు నా పయనం ! ॥ నా ధ్యేయం ॥**

**తనువు కరిగినా ... ధనము తరిగినా**
**కరుగదు, తరుగదు నా ధైర్యం**
**లోకాలన్నీ ఎదురై వచ్చినా**
**జడియను జడియను ఎన్నటికి**
**జడిసి ఆగను ఎన్నటికి ! ॥ నా ధ్యేయం ॥**

**నీలోనుండి వచ్చిన నేను ... నీలోనే ఇక కలవాలి**
**కలిసి, కలిసి, కరిగిపోయి**
**కన్నుల పండుగ కావాలి**
**నా కలలే ఫలించి తీరాలి ! ॥నా ధ్యేయం॥**

"సాధకుడికి మనస్థైర్యం, తన సాధనపై ప్రగాఢమైన విశ్వాసం, పట్టుదల ఉంటేనే గాని పురోగమించలేడు. స్థితప్రజ్ఞ కలిగితేనేగాని విజయం పొందలేడు" అనే సత్యాన్ని అనుభవపూర్వకంగా ఋజువు చేశారు శ్రీ విశ్వంజీ.

శ్రీ విశ్వంజీ గారి యోగసాధనను మనం పరిశీలిస్తే అది ముఖ్యంగా

మూడు దశలుగా సాగినట్లు కనిపిస్తుంది. మొదటిసారి మహారాజ్ జద్చర్లకు వచ్చి, వారికి మంత్రోపదేశం చెయ్యడానికి పూర్వమున్న కాలాన్ని మొదటి దశగా మనం భావించవచ్చు. అంటే మాస్టరుగారు బి.ఎ.లో చేరినప్పటి నుండి మంత్రలాభం పొందేటంతవరకూ మధ్యనున్న (1961–1967) ఆరు సంవత్సరాల కాలం "పూర్వ సాధనాదశ". మహారాజ్ ఓం ప్రథమం జద్చర్లకు వచ్చి, మంత్రోపదేశం చేసిపోయి, తిరిగి రెండవసారి జద్చర్లకు వచ్చేవరకు మధ్యనున్న (1967–1974) ఏడు సంవత్సరాల కాలం రెండవదశ. దీనిని మనం సాధనా దశగా పేర్కొనవచ్చు. రెండవసారి గురువుగారు వచ్చి దత్తమాలా మంత్రాన్ని ఉపదేశించిన లగాయతు, మాస్టరుగారు కృష్ణనగర్‌లోని శ్రీ ఆకుల కోటేశ్వరరావు గారి గృహాన్ని 'విశ్వమందిరం'గా జేసుకొని అక్కడ నివసించడానికి మొదలు పెట్టేవరకు మధ్యనున్న (1974–1988) పద్నాలుగు సంవత్సరాల కాలం మూడవ దశ. ఇది సిద్ధదశ. కృష్ణనగర్‌లో వారు నివసించటం మొదలు పెట్టిన దగ్గర్నుంచి ప్రారంభమైన దశను – వారే కారణం కోసం అవతరించారో ఆ ధ్యేయం నెరవేర్చడానికి సాగిస్తున్న "ప్రబోధ దశ"గా మనం పరిగణించవచ్చు. విశ్వయోగి అసలు కార్యక్రమం ఈ దశనుంచే ప్రారంభమైంది.

బి.ఎ. చదువుతున్నప్పుడు మాస్టరుగారు వ్రాసుకొన్న డైరీల్లోని సూక్తులు, కవితలు మనం చూస్తే విద్యార్థి దశనుంచే వారిలో భగవదన్వేషణ ప్రారంభమైనట్లు తెలుస్తున్నది. సచ్ఛీలం, బ్రహ్మచర్యం, నిస్స్వార్థం, నిష్కామం, నిరహంకారం, భూతదయ మొదలైన సాత్విక గుణాలను ప్రోగు చేసుకొని, పరిరక్షించుకొంటూ వస్తేనేగాని ఆత్మసాక్షాత్కారం లభించదు. త్రికరణశుద్ధి లేకపోతే హృదయ దర్పణంలో భగవంతుడు ప్రతిఫలించడు. దేహాన్ని పవిత్రంగా ఉంచుకొని, హృదయం నిండా దయను నింపుకొన్నప్పుడే మానవుడు మాధవుడౌతాడు."

"ఆశలు, మమతలు పెంచుకొంటే తెంచుకోవటం కష్టమౌతుంది".

"అతి చనువు అన్ని వేళలా ప్రమాదమే".

"అనవసర విషయాల్లో జోక్యం చేసుకొని, మన విలువను మనం పోగొట్టుకో గూడదు. మన మాటకు విలువలేని చోట మౌనమే శరణ్యం".

"మనం కలలోగూడా ఊహించని, ఆశించని సంఘటన జరిగితే, నిర్ఘాంత పోయి, నిశ్చేష్టులమై, ఆలోచనా రహితులమై, నీరస పడిపోతాం".

"హద్దుమీరిన నమ్మకం, విశ్వాసం ప్రమాదకరం".

"మనం అమితంగా ఏది కావాలని కోరుకుంటామో, దేని కోసం ఎదురు చూస్తామో అదే దూరమౌతుంది. ఇదే సృష్టి వైచిత్రం!"

"తియ్యగా ఉన్నదంతా అమృతం కాదు".

"అవివేకంతో అహంకారంతో ఆడిన మాటవల్ల, నిశ్చలంగా నిర్మలంగా ఉన్న మనస్సు కల్లోలమై విరిగి పోగలదు. ఒకే ఒక్కమాట ఒక వ్యక్తి జీవితాన్ని సమూలంగా నాశనం చెయ్యగలదు".

ఇట్లా అనేకానేకంగా మాస్టరుగారు డైరీలో వ్రాసుకొన్న సూక్తులు, జీవితంలో వారు చవిచూచిన ఒక్కొక్క చేదు అనుభవానికి ప్రతీకలుగా మనం భావించవచ్చు. స్వార్థంతో, అహంకారంతో, ఆవేశకావేశాలతో, ఈర్ష్యాసూయలతో, మోసాలతో, ద్వేషాలతో నిండిన ఈ లోకంలో, మంచితనంతో మనుగడ సాగించాలంటే, అడుగడుక్కి ఎన్ని అవహేళనలకు గురి కావాలో, ఎన్ని తిరస్కార పురస్కారాలు పొందాలో, ఎన్ని ఎదురుదెబ్బలు తినాలో, గుండె తొలిచే బాధతో ఎంత గిలగిలలాడాలో, మొక్కవోని అచంచల ధైర్యంతో, అకుంఠితమైన ఆత్మవిశ్వాసంతో, సాటిలేని సాహసంతో, తన్ను తానే సమాశ్వాసించుకొంటూ, గమ్యం వైపు ఎట్లా సాగిపోవాలో పైన సూచించిన మాస్టరుగారి సూక్తులు మనకు వెల్లడిస్తాయి. నిరాశ, నిస్పృహల్లో కొట్టిమిట్టాడుతూ, ధైర్యం చెప్పేవారులేక, దారి చూపేవారులేక, చేయూత నిచ్చేవారు లేక "అయ్యో" అనేవాళ్ళు లేక, ఒంటిగా కటిక చీకట్లో, ఉరవడిగా ప్రవహిస్తున్న కాలప్రవాహంలో కొట్టుకుపోతూ, తనకు తానే ధైర్యం చెప్పుకొంటూ, తనను తానే ఉద్ధరించుకొంటూ, తనను తానే తెలుసుకొంటూ, పడిపోకుండా లేని శక్తిని కూడదీసుకొని నిలదొక్కు కుంటూ సాగిపోయే సాధకుని మనఃస్థితి మొట్టమొదట్లో అస్తవ్యస్తంగా, చీదరగా, భయంభయంగా చికాగ్గా ఉంటూ

మనస్సును వెనక్కులాగుతుంటుంది. నిరాశ ఆవరిస్తుంది. నిస్పృహ ఆవేశిస్తుంది. ఇది సాధకులందరికి తెలిసిన విషయమే!

బాధలకూ, వ్యధలకూ, కష్టాలకూ, నష్టాలకూ, జీవన గమనంలో తగిలే ఎదురు దెబ్బలకూ ఎవ్వరూ డీలా పడిపోరాదు. స్థైర్యం కోల్పోరాదు. అమూల్యమైన కాలాన్ని వ్యర్థం చేయరాదు. ఎవడికివాడు తనకోసం కాక పదిమంది కోసం బ్రతకాలి. పదిమంది సంఘటితమైన ఒకడి కోసం నిలవాలి. కష్టసుఖాలు పరస్పరం పంచుకొంటూ మంచి మనుగడ సాగించాలి. అప్పుడే వాళ్ళు మనుష్య లనిపించుకొంటారు. మాన వత్వాన్ని నింపుకొనని గుండెలో నవశక్తి ఆవిర్భవించదు. సాధన ముందుకు సాగదు. ఈ సత్యదర్శనం కావటం వల్లనే మాస్టరుగారిట్లా అంటారు.

మాస్టరుగారికి విద్యార్థి దశనుంచే తత్త్వాన్వేషణ ప్రారంభమైనట్లు తెలుతుంది. ఈ అన్వేషణకు ఆయన చుట్టూతా ఉన్న వాతావరణం చాలావరకు సహకరించింది. మిత్రులు, తాత్త్వికులు, భక్తులు, వారి సాధనకు పూజలు, మనస్సుకు కొంత వూరటనూ, ఉత్సాహాన్నీ కలిగిస్తూ, ముందుకు సాగిపోవాలనే ఔత్సుకాన్ని కలిగిస్తూ వారి మానసిక వికాసానికి దోహద పడ్డారు.

**"ఉన్నాడా దేవుడు?**
**ఎక్కడ కూర్చొని ఉన్నాడు?**
**ఏ మూల నక్కి ఉన్నాడు?**
**ఏ మూల మౌనం పూనాడు?**
**ఎంత వెదికినా కనిపించడేం?**
**ఎంత పిలిచినా పలకడేం?**
**అవినీతిని ఆపటం చాతకాక**
**అఘోరిస్తూ కూర్చున్నాడా??"**

అంటూ గజేంద్రునిలా దేవుని ఉనికినే అనుమానించి, తీవ్రమైన ఆవేదనతో ప్రశ్నించిన మాస్టరుగారు, ఆ తర్వాత సత్యం బోధపడి, పట్టరాని సంతోషంతో పరవళ్ళు త్రొక్కుతూ -

**"ఉన్నాడు దేవుడు - కన లే**

**కున్నాడు మానవుడు**

**లేని దెక్కడ దేవుడు?**

**నిండి ఉన్నాడు విశ్వమంతా -**

**అంతటా ఉన్నాడు దేవుడు**

**కనలేకున్నాడు మానవుడు మాయచే"**

అని ఎలుగెత్తి చాటారు. భవిష్యత్తులో, అనతికాలంలో లభించబోతున్న గురుకటాక్షానికి అనువుగా, అన్నివిధాల వారి హృదయం పరిశుద్ధమై, దత్తప్రభువు ఆసీనులు కావడానికి సంసిద్ధమైంది. ఆర్తితో, గుండె ద్రవించేలా పిలిచిన మాస్టరుగారి పిలుపు విని, విశ్వమానవ సమైక్యతా సముపార్జన ద్వారా విశ్వకళ్యాణం జరపడానికి కావలసిన శక్తిని ఆయనకు ధారపోయటం కోసం, గురుదేవులు దత్తాత్రేయ వాడీకర్ గారి రూపంలో సాక్షాత్తు దత్తప్రభువే జద్చర్లకు వచ్చి, తాము వచ్చిన పనిని విజయవంతంగా ముగించుకొని, యథేచ్ఛగా వెళ్ళిపోయారు.

మొదటిసారి మహారాజ్ జద్చర్లకు వచ్చి వెళ్ళిన తరువాత, ప్రతిరోజు మాస్టరుగారు ఉదయం, సాయంత్రం దత్తమందిరానికి పోయి, అక్కడే ధ్యానంలో ఎక్కువకాలం గడుపుతుండేవారు. వీడి చర్య చూస్తుంటే సన్యాసుల్లో కలిసిపోయే టట్లుంది. ఏదైనా వ్యాపకంలో పెట్టటం మంచి"దని అన్నగారు తలపోసి, మాస్టరుగారిని గుంటూర్లో బి.ఇడి., కోర్సులో చేర్పించారు. తమ పెద్దక్కయ్య శ్రీమతి సీతారామమ్మ గారింట్లో ఉంటూ ఆ కోర్సు పూర్తి చేశారు.

ఆ రోజుల్లో ఆయన వేకువనే నిద్రలేచి, ఎనిమిది అయ్యేలోగా మంత్రానుష్ఠానం పూర్తిచేసుకునేవారు. జపం చేసేటప్పుడు ఆయనకు వొళ్ళు తెలిసేది కాదు. శరీరం మీద చీమలు పాకుతున్నా, ఈగలు వాలుతున్నా ఆ స్పర్శజ్ఞానమేమీ వారికుండేది కాదు. మున్సిపాలిటీ స్వాధీనం జేసుకోవటంతో మున్సిపల్ హైస్కూల్ టీచరుగా స్థిరపడి, రైలుపేటలోని శ్రీ జలగం రామారావు

మెమోరియల్ మున్సిపల్ హైస్కూలుకు బదిలీయై వచ్చి, లెక్కలూ, ఇంగ్లీషూ బోధిస్తూ, అచిరకాలంలోనే మంచి ఉపాధ్యాయుడనే పేరు సంపాదించుకొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణకూ, మానవతా విలువల సంపాదనకూ భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు చేస్తున్న ధర్మ ప్రచారానికి ఆకర్షితులై, బాబాగారిని సాక్షాత్తు తమ గురుస్వరూపమైన దత్తాత్రేయస్వామిగా భావించారు. రోజూ సాయంత్రం బాబా భజనలు చేస్తుండేవారు. ప్రతిరోజు ఆయన తమ ఇంటికి పచ్చతోరణం నియమంగా కట్టేవారు. స్వంతంగా భజన కీర్తనలు వ్రాసి భజనల్లో పాడుతుండేవారు. శ్రావ్యమైన కంఠంతో ఆయన పాటలు పాడుతుంటే అంతా విని, పరవశించి పోయేవాళ్ళు. సాయిబాబాను శ్రీదత్తాత్రేయ స్వరూపంగా భావిస్తూ, అప్పుడాయన వ్రాసిన ఈ పాట చూడండి –

**నిన్నే నమ్మితి దత్తాత్రేయా!**
**నన్ను కావరా దత్తాత్రేయా!**
**మనమున నిరతము నిన్నే నిలిపి**
**పూజలు సలుపుదు దత్తాత్రేయా!** ॥నిన్నే॥

**ఆసనమా అది నా హృదయం**
**ఆర్ఘ్యపాద్యములు నా కన్నీళ్ళు**
**నైవేద్యమా అది నా సర్వస్వం**
**మంగళహారతి కామదహనము!** ॥నిన్నే॥

**యోగి రూపమున వెలసిన దేవా!**
**మము రక్షింపగ నిలచిన దేవా!**
**సనాతన ధర్మోద్ధరణకై**
**అవతరించిన ఓ అవధూతా!** ॥నిన్నే॥

(సశేషం)

**(కీ॥శే॥ కె.నరసింహ, ఐ.పి.ఎస్. రిటైర్డ్ గారు సంకలనం చేసిన 'ఆత్మబంధువు' నుండి సేకరణ)**

# అనుభవలహరి

**- శ్రీమతి వాణి రామరాజ్**

1998 మార్చి 5న స్వామివారి జన్మదిన వేడుకలకు నేను సీతారామస్వామి గారి కుటుంబంతో కలిసి గుంటూరు వెళ్ళాను. నాదగ్గర డబ్బులు లేకపోతే నా మేనమామ కూతురు లక్ష్మి దగ్గర బదులు తీసుకొన్నాను రూ. 300/–లు. ఈ విషయము నేను ఎవరికి చెప్పలేదు, నేను టిక్కెట్టు డబ్బులు లెక్కకట్టి బాబాయిగారికి ఇచ్చేసాను, "గురుచరిత్ర" కొనుకొన్నాను అలా చాలా వరకు ఖర్చు పెట్టేసాను. జన్మదిన వేడుకలలో పాల్గొని స్వామివారి పరిపూర్ణమైన ఆశీస్సులు తీసుకొని తిరిగి హైదరాబాదుకు రావడము జరిగింది. అప్పుడు నేను హాస్టల్లో వుండేదాన్ని.

నా పర్సులో రూ.300/–లలో ఖర్చుపెట్టగా మిగిలిన చిల్లర ఎంత వుందని లెక్కిస్తుండగా – సుమారు రూ.100 కి పైగా చిల్లరతో బాటు నేను మామయ్య గారి అమ్మాయి లక్ష్మి దగ్గర తీసుకొన్న రూ.300/– ఆమె ఎలాంటి నోట్లు ఇచ్చిందో అలాగే వున్నాయి నా పర్సు (హేండ్‌బాగ్)లో.

ఆశ్చర్యం! ఆనందం! దుఃఖం! చంటి బిడ్డలా వెక్కివెక్కి ఏడ్చాను. స్వామికి నాపైన కలిగిన జాలికి దయకు అనుగ్రహానికి.

తదుపరి స్వామివారి దర్శనానికి వెళ్ళినప్పుడు వారి దృష్టికి ఈ విషయాన్ని తీసుకొనిరాగా వారు భక్తులకు అద్భుతమైన సందేశాన్ని ఇచ్చారు, "ఒకసారి గురువును ఆశ్రయించిన వారికి ఏ విధమైన లోటు వుండదు"అని.

ఆ తరువాత ఒక మారు నాకు సరి అయిన ఉద్యోగం లేక మా దూరపు బంధువు ఇంటిలో వున్నాను హాస్టలు వదిలి.

మళ్ళీ నాలో అంతర్మథనం ... భగవంతుడున్నాడా? గురువు గారు, నిజమేనా!!! నాకెందుకు మంచి జీవితం లభ్యం కాలేదు ... ఇలా ... ఎన్నో ప్రశ్నలు నన్ను నిద్రకు దూరము చేసాయి; ఇంతలో త్రాడుతో కట్టి గోడమూలకు పెట్టిన "వీణ" నావీణ మెట్లు కదిలి, హో!! మీకు నమ్మకం కలిగినా కలగక పోయినా ఇది నిజం. "స రి గ ప ద స" మోహనరాగం పలికింది. ఆ శబ్దానికి

మా బంధువు సీత అత్త. వారితో బాటు అంతా మేల్కొన్నాం. రాత్రి సుమారు 2 గంటలు కావస్తుంది. కట్టి మూలపెట్టిన వీణ అదే మాదిరి అక్కడుంది. శబ్దం మాత్రం వస్తున్నది. అంతా అది స్వామి అనుగ్రహమని. నాకు తమ ఉనికిని తెలిపారని భావించడం జరిగింది. జీవితంలో ఆ అనుభవం ఎప్పటికి మర్చిపోలేను. నాకు ధైర్యానిస్తు, నన్ను ప్రతిక్షణము కాపాడుతూ స్వామి నా జీవితాన్ని మార్చే ప్రయత్నంలో నన్ను వెన్నంటి వున్నారు.

భగవాన్ గురుదేవులు దర్శనము చేసుకుంటూ వారి పాదధూళితో నాలో వున్న మాలిన్యాన్ని శుభ్రపరచుకొంటూ వారియొక్క అనుగ్రహం కోసం తపిస్తూ, చిన్న ఉద్యోగము చేసుకొంటూ నాకు స్వామి వున్నారనే ధైర్యంతో కాలం గడుపుతున్నాను మంచిరోజులు కోసము ఎదురుచూస్తూ ...

స్వామి వారితో నేను చాల తక్కువ మాట్లాడటము అలవాటు ... 20 సం॥లలో నేను వారితో నోరు తెర్చి మాట్లాడింది 20 మార్లు కూడ వుండవు.

ఇంతలో సీతారామస్వామి వారు కాకినాడలో ఒక ఆశ్రమము నిర్మించారు. స్వామివారి చేతులమీదుగా విగ్రహ ప్రతిష్ఠ మొదలగు కార్యక్రమములు జరిగినవి. స్వామివారు కాకినాడ భక్తులు అందరి ఇంటికి రావడం జరిగింది. వారు దయతో మా ఇంటికి కూడ విచ్చేసి నాతల్లిదండ్రులకు, నా కుటుంబ సభ్యులందరికి వారి యొక్క దివ్యమంగళ శుభాశీస్సులు అనుగ్రహించారు.

కాలము గడిచిపోతుంది, నేను బాబాయిగారికి రిక్వెస్టు చేసాను. గురువు గార్ని నా గురించి అడగండి అని, బాబాయిగారు నా వివాహం గురించి అడిగారు. స్వామి నన్ను "గాణగాపురం" వెళ్ళి దత్తదర్శనం చేసుకోమని చెప్పారు. గాణగాపురంలో నిజంగా భగవంతుడున్నాడు అనే ఆచారాన్ని మనం చూస్తాము. అక్కడ మధ్యాహ్నం "భిక్ష" స్వీకరించాలి, మనము అక్కడ భక్తులకు తినడానికి రొట్టె, అన్నము, పళ్ళు ఇలా ఏమైన మనము ఇవ్వాలి, ఎవరైనా మనకు ఇస్తే స్వీకరించాలి.

నేను పళ్లు భిక్షగా ఇచ్చాను. నేను నాకొంగు చాచి భిక్షకు ఎదురు

చూస్తున్నాను, అడుగుతున్నాను. ఒక్కరు కూడ నాకు భిక్ష వేయలేదు. నా ప్రక్కన వున్నవారికి భిక్ష వేస్తున్నారు, నాకు వేయకుండా వెళ్ళిపోయేవారు.

స్వామీ! ఏమిటీ పరీక్ష! నన్ను అనుగ్రహించండి, అని వేడుకొన్నాను, ఆ దత్తభగవానుని. ఒక వృద్ధుడు నా వద్దకు వచ్చి నన్ను పరిపూర్ణంగా పరిశీలించి, వారి చేతిలో వున్న అరటిపండును సగం చేసి, ఆ సగం నాకు భిక్ష వేసారు. ఆ విధంగా స్వామి నాకు జీవితాన్ని ఇచ్చారు. భగవంతుడున్నాడు అనే సత్యాన్ని నమ్మి తీరాలిక్కడ!

మన గురువుగారి గురువుగార్ని కూడ నేను దర్శించుకోవడము, వారి ఆశీస్సులతో “మక్తల్” దగ్గర “కురుమగడ్డ” వెళ్ళి శ్రీపాదవల్లభుని ఆశీస్సులు తీసుకోవడం జరిగింది.

బాబాయిగారు వాళ్ళతో షిరిడి వెళ్ళి సాయినాథుని దర్శనము చేసుకోవడం గురువుగారి యొక్క సంకల్పమే.

# కథాసూక్తము

భక్తులతో మాట్లాడుతూ మిలటరీ వారు, పోలీసు వారు, స్త్రీలు ఈ ముగ్గురు సమాజానికి చాలాముఖ్యం, వీరే ఆధారం కూడా అని స్వామి అన్నారు. మిలటరీ వారు దేశరక్షణ గురించి సరిహద్దు ప్రాంతాలలో ఎటువంటి వాతావరణ పరిస్థితిలో అయినా రాత్రింబగళ్లు కాపలా కాస్తారు. అందుకనే మనం నిశ్చింతగా ఉన్నాము. దేశంలో శాంతిభద్రతలను సంరక్షించేది పోలీసు వారు. అందుకే వీరు సమాజానికి ముఖ్యం అన్నారు. స్త్రీ సహజంగా భర్త గురించి, బిడ్డల గురించి తపన పడుతుంది. ఎవరో కొంతమంది తప్ప సాధారణంగా స్త్రీలు భర్తలో లోపాలు చూడరు. సీతని అగ్నిప్రవేశం చేయించినందుకు, అడవికి పంపినందుకు పురాణ పురుషుడయినటు వంటి రాముడుని ప్రశ్నించారు. శంకరాచార్యులవారు సన్యాసం స్వీకరించినా తల్లికి ఇచ్చిన మాట ప్రకారం ఆమెకు అంత్యక్రియలు జరిపారు, దానికి సమాజం నుంచి వెలివేయబడ్డాడు. సన్యాసి తండ్రికి నమస్కారం చేయడు కాని తల్లికి నమస్కారం చేయాలి. మహిళలను పొగుడుతూ ఒక రోజును అంతర్జాతీయ మహిళా దినంగా జరుపుతున్నారు. అందుకనే స్వామి 108 మంది మహిళలకు సువాసిని పూజ జరిపి వారికి పాదాభివందనం చేసారు.

# సత్యసాయి చరితామృతం

(గత సంచిక తరువాయి)

వెంకమరాజు 'నువ్వు దేవుడివా, దెయ్యానివా?' అని గద్దించి ప్రశ్నించిన దానికి జవాబుగా బాల సాయి 'నేను సాయి బాబాని' అన్న జవాబు విని నిశ్చేష్టులయ్యారు. ఆ జవాబు యొక్క అంతరార్థాన్ని తెలుసుకొనలేక బాబా వైపు చూస్తూ ఉండిపోయారు. సత్య తన జవాబును కొన సాగిస్తూ 'ఆపస్తంబ సూత్రానికి చెందిన వాడిని. నాది భారద్వాజ గోత్రం. నేను సాయిబాబాని. అందరిని కష్టాలనుండి తరింపచేయడానికి అవతరించాను. మీ ఇండ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.' అన్నగారైన శేషమరాజు, 'సాయిబాబా అంటే ఎవరు?' అని అడిగిన దానికి సత్య జవాబివ్వలేదు. 'మీ పూర్వీకుడు, వెంకావధూత ప్రార్థించగా నేను అవతరించాను,' అని సత్య చెప్పిన మాటలు వారిని మరింతగా ఆశ్చర్యపరిచాయి. 'సరే, ఇప్పుడు మేము చేయవలసిందేమిటి?' అని అడగగా 'ప్రతి గురువారం నన్ను ఆరాధించండి. మీ ఇండ్లను, మనస్సులను పరిశుద్ధంగా ఉంచుకొనండి,' అని బాబా సూచించారు.

ఒక గురువారం నాడు 'నీవు సాయి బాబా అయితే ఏదైనా సాక్ష్యం చూపించు,' అని ఎవరో గట్టిగా అడిగారు. 'తప్పక చూపిస్తాను,' అంటూ కొన్ని మల్లిపూలను తెప్పించి, వాటిని నేలపైన విదజల్లారు. అవి నేలమీద తెలుగు అక్షరాలలో 'సాయిబాబా' గా ఏర్పడ్డాయి.

హోస్పేటలో నివసిస్తున్న కొందరు పెద్ద మనుష్యుల ఆహ్వానం అందుకొని శేషమరాజు స్థలం మార్పువలవ బాలబాబా మానసిక ఆరోగ్యం మెరుగుపడ వచ్చునేమో అని సత్యను తీసుకొని హోస్పేట వెళ్ళారు. హోస్పేట ప్రస్తుతం కర్నాటక రాష్ట్రంలో తుంగభద్రానది సమీపంలో ఉన్న చిన్న నగరం. ఒకానొకప్పుడు అది శ్రీకృష్ణదేవరాయలు పాలించిన విజయనగర సామ్రాజ్యానికి రాజధానిగా ఉండేది. ప్రస్తుతం శిధిలావస్థలో ఉంది. అక్కడ ప్రసిద్ధి చెందిన విరూపాక్ష దేవాలయం ఉంది. శేషమరాజుతో కూడా వెళ్ళిన అందరూ విరూపాక్షుని దర్శనం చేసుకుందుకు గుడి లోపలకు వెళ్ళారు. కాని సత్య మాత్రం గుడి గోపురాన్ని తిలకిస్తూ బయటే ఉండిపోయారు. విరూపాక్షుడు అ నాటి విజయనగర రాజుల ప్రధాన ఆరాధ్య దేవత. ఆ దేవతరూపంలో వారందరికీ ఆశ్చర్యకరంగా సత్యసాయి కనిపించారు.

(సశేషం)

# గీతమంజరి

మంచినీతుల నెన్నిటి వించునున్న
దుర్జనుఁడు సాధుజనుఁ డౌట దుర్లభంబు
మంచినీటినదులు ప్రవహించుచున్న
సాగరజలంబు లవమైన స్వాదువగునె.

సుద్దు లెన్నింటిఁ జెప్పిన బుద్ధి గుదిరి
వక్రచిత్తముల్ సరళభావంబుఁ గనవు
ఎన్నిసారులు సరిదీసి తన్నుకున్నఁ
గుక్కతోఁక వంకరదీరి చక్కఁబడునె.

గొప్పవారియండనుజేరి కొలఁదివారు
ప్రకృతిచే మందులయ్యును వన్నెగాంత్రు
అంబరంబున గ్రహరాజు నండఁజేరి
చల్లనివెలుంగు బడయఁడే చందమామ.

సత్పథంబున విహరించుజనము లెపుడు
మిగుల నల్పులయ్యును గడుమెఱయుచుంద్రు
సత్పథంబుననుండు నక్షత్రము లతి
సూక్ష్మతరము లయ్యును గడుశోభ గనవె.

(కీ॥శే॥ చిలకమర్తి లక్ష్మీనరసింహము గారు రచించిన గీతమంజరి నుండి సేకరణ)

## 'చందాదారులకు గమనిక'

**టెలిఫోను/మొబైలు ఫోను సౌకర్యం ఉన్న చందాదారులు వాటి నెంబర్లను శ్రీ కె.కె.గుప్త (9848414585) గారికి ఫోను చేసి తెలియ పరచవలసింది. లేఖ ద్వారా పి. రామగోపాలరావు, 3-5-1092/2, వెంకటేశ్వర కాలనీ, నారాయణగూడ, హైదరాబాదుకు పంపవలసింది. విశ్వసూక్తము సంచిక ఒకటి కన్న ఎక్కువ అందుతున్నట్లైతే ఆ విషయాన్ని శ్రీ కె.కె. గుప్తా గారికి తెలియ జేయవలసింది.**

# FORM - IV

Statement about ownership and other particulars about Magazine(Viswasuktham) to be published in the 19th of every month

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | Flat No.G2, Orchids,<br>Durga Bai Deshmukh Colony,<br>Hyderabad - 500 007,<br>Telengana State |
| 2. | Periodicity of its publication | : | Monthly |
| 3. | Printer's Name | : | Sri Lakshmi Graphics |
| | Nationality | : | Indian |
| | Address | : | 1-8-436, Street No.10,<br>Chikkadapally,<br>Hyderabad - 500020<br>Telephone No : 040 - 66662976 |
| 4. | Publisher's Name | : | K.V.R.Surya Rao |
| | Nationality | : | Indian |
| | Address | : | Flat No.G2, Orchids,<br>Durga Bai Deshmukh Colony,<br>Hyderabad - 500 007,<br>Telengana State |
| 5. | Editors Name | : | K.V.R.Surya Rao |
| | Nationality | : | Indian |
| | Address | : | Flat No.G2, Orchids,<br>Durga Bai Deshmukh Colony,<br>Hyderabad - 500 007,<br>Telengana State |
| 6. | Name and address of individuals whon own the magazine and partners or shareholders holding more than one per cent of the total capital. | : | K.V.R.Surya Rao<br>Flat No.G2, Orchids,<br>Durga Bai Deshmukh Colony,<br>Hyderabad - 500 007,<br>Telengana State |

I, K.V.R. Surya Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

Date : 19-4-2019 Signature of the Publisher